ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత సోమవారం గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి

జిల్లా వార్తలు

మంగళవారం 5 ఆగస్టు 2025



శింగనమల కెనరా బ్యాంకులో సోదనపల్లి రైతు దంపతులు ఆదినారాయణ, లక్ష్మీదేవి ఆనందం

పులకించని మది పులకించె..!

- బ్యాంకులలో సందడే సందడి
- అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ సొమ్ము విత్‌డ్రా
- విత్తనాలకు చేసిన అప్పు తీరుస్తామన్న రైతులు
- చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారని హర్షం

శింగనమల/ధర్మవరం రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ నుంచి రబీ దాకా..! దుక్కి నుంచి పంట అమ్మేదాకా..! ఎప్పుడూ ఏదో ఒక కష్టం..! ఏది ముట్టుకున్నా నష్టం..! ఎప్పుడోగానీ రైతు ముఖం విచ్చుకోదు. నిత్యం ఆలోచనలు, ఆవేదనలతో నిండి ఉండే మట్టి మనిషి ముఖం విప్పారింది. దీనికి కారణం.. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం. అన్నదాత సుఖీభవ తొలివిడ సాయం అందించడం. అదే సమయంలో పీఎం కిసాన్ కింద మరింత సాయం అందడం. కష్టకాలంలో నాలుగు డబ్బులు చేతిలోపడగానే రైతుల ముఖాలు ఆనందంతో వికసించాయి. 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్' పథకాల సొమ్మును (మిగతా 6లో...)



ముద్దాడి.. ముద్దాడి..
మురిసిపోతివే..
నా తల్లీ అంటూ
పరితపిస్తివే..
నా లోకం నీవు అంటూనే..
ఈ లోకం విడిచిపోతివా..
ఈ పాపను ఒంటరిని చేసి..
కనుమూసితివా..
నా కనుపాపా..

విలపిస్తున్న అఫ్రీన్ భాను కుమార్తె అల్మాస్

అమ్మా.. అమ్మా..

హిందూపురం, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు భరించలేక స్థానిక ఆటోనగర్‌కు చెందిన అఫ్రీన్ భాను(22) సోమవారం ఆత్మహత్య చేసుకుంది. ఆమె తొమ్మిది నెలల చిన్నారి అల్మాస్ విలపించడం కంటతడి పెట్టించింది. టూటౌన్ ఎస్ఐ బ్రహ్మానందరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆటోనగర్‌కు చెందిన అఫ్రీన్‌భానును రెండేళ్ల క్రితం అదే ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ అమీర్‌ఖాన్‌కు ఇచ్చి వివాహం చేశారు. కొన్నాళ్లపాటు వీరి దాంపత్య జీవితం సజావుగా సాగింది. ఆ తరువాత భర్త వేధించడం మొదలెట్టాడు. అతడు అనుమానం పెంచుకున్నాడు. దీంతో మనస్తాపం చెందిన అఫ్రీన్ భాను సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని, మరణించింది. కాసేపటికి గుర్తించిన కుటుంబ సభ్యులు.. పోలీసులు, బంధువులకు సమాచారం ఇచ్చారు. టూటౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అఫ్రీన్‌భాను తల్లి షేక్ షాజియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.



అఫ్రీన్ భాను మృతదేహం

క్షేత్రస్థాయికి వెళ్లి సమస్య పరిష్కరించాలి: కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సమస్యలపై ప్రజలిచ్చిన అర్జీలను క్షేత్రస్థాయికి వెళ్లి సమగ్రంగా పరిశీలించి, పరిష్కరించాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి 269 అర్జీలను స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్ణీత గడువులోపు అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఒక సమస్యపై వచ్చిన ఫిర్యాదు మళ్లీ రాకుండా జాగ్రత్త పడాలన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణరెడ్డి, రామసుబ్బయ్య, ఆర్డీవో సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఓ సమత, డీఏఓ సుబ్బారావు, డీఎస్ఓ వంశీ కృష్ణారెడ్డి, డ్వామా పీడీ విజయేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం: కలెక్టర్

గోరంట్ల, (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. మండలంలోని పాలసముద్రం వద్ద గల నాసిన్ అకాడమీ ప్రాంగణంలో ఏర్పాటైన కేంద్రియ విద్యాలయంలో 2025-26 సంవత్సరానికి సోమవారం తరగతుల ప్రారంభోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 1 నుంచి ఐదు వరకు తరగతులను ప్రారంభించారు. విద్యార్థుల సమగ్ర వికాసానికి, నాణ్యమైన విద్యా అందించడానికే కేంద్రియ విద్యాలయాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. మన ప్రాంతానికి నాణ్యమైన ఇంగ్లిషు విద్య అవసరమని, గ్లోబల్ స్థాయిలో ఎదగాలంటే భాషా సామర్థ్యం తప్పనిసరి అన్నారు. మాతృభాషా తెలుగుమీద గౌరవం తగ్గకుండా రెండు భాషాల్లోనూ ప్రవీణ్యం సాధించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో నాసిన్ జాయింట్ డైరెక్టర్ సత్యదివ్యరమ్య, డిప్యూటీ డైరెక్టర్ శేష, కేంద్రియ విద్యాలయం ప్రిన్సిపాల్ కృష్ణారావు, తహసీల్దార్ మారుతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టమోటాకు టైమొచ్చింది..!

ఏడాది తర్వాత ధరలు

కిలో రూ.30 నుంచి రూ.44 మధ్య పలుకుతున్న వైనం

అన్నదాతల్లో ఆనందం



అనంతపురంరూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు టమోటాకు గిట్టుబాటు ధర దక్కుతోంది. ఏడాదిగా ధరల్లేక రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. కూలి ఖర్చులు కూడా దక్కలేదు. కొంత మంది పంటను చేనులోనే వదిలేశారు. ఇంకొందరు తొలగించి, రోడ్డు పక్కనే పడేశారు. గిట్టుబాటు ధరలు కల్పించాలంటూ అన్నదాతలు రోడ్డెక్కి నినదించారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు టమోటా ధరలు పెరుగుతున్నాయి. దీంతో అన్నదాతకు ఉపశమనం దక్కుతోంది.

పెరుగుతున్న ధరలు..

జిల్లాలో 5,600 హెక్టార్లలో టమోటా ప్రస్తుతం సాగుతో ఉంది. ఇందులో 30 శాతం వరకు కోత దశలో ఉన్నట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు. కక్కలపల్లి టమోటా మార్కెట్‌కు రోజూ 3 వేల టన్నులకు పైగా టమోటా ఉత్పత్తులు వస్తున్నాయి. ఇతర ప్రాంత మార్కెట్లలోనూ ఆశించిన స్థాయిలో టమోటా ఉత్పత్తులు లేకపోవడం ఇక్కడ ధరల పెరుగుదలకు కారణం. వారం రోజులుగా ధరలు స్థిరంగా పలుకుతున్నాయి. గరిష్ఠంగా రూ.30 నుంచి రూ.44 మధ్య అమ్ముడుపోతున్నాయి. 15కిలోల బాక్సు రూ.450 నుంచి రూ.660 వరకు పలుకుతోంది. గతంలో మచ్చలున్నవి, గోలీల్లాంటి కాయలను పడేసేవారు. ప్రస్తుతం వాటికి కూడా మంచి ధర దక్కుతోంది. వీటి ధర కూడా 15 కిలోల బాక్సు రూ.వందకి పైగానే పలుకుతోంది.

ఇతర ప్రాంతాల్లో తగ్గిన ఉత్పత్తులు

జిల్లా నుంచి మదనపల్లితోపాటు పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ, ఉత్తర ప్రదేశ్, ఢిల్లీ, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు టమోటా ఎగుమతి అవుతోంది. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో స్థానికంగా ఉత్పత్తులు చాలా తక్కువగా వస్తున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో వ్యాపారులు చాలావరకు ఇక్కడి నుంచే కాయలు కొనుగోలు చేసి, ఆయా ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. వెరసి స్థానిక మార్కెట్‌లో టమోటాకు డిమాండ్ పెరిగింది. వేలంలో కూడా కాయల కొనుగోలుకు వ్యాపారులు పోటీ పడుతున్నట్లు మార్కెట్ వర్గాలు అంటున్నాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే.. మరో వారం పదిరోజులపాటు ధరలు ఇదేవిధంగా ఉంటాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గతేడాది నష్టాలపాలు

గతేడాది టమోటా సీజన్ ప్రారంభంలో భారీ డిమాండ్ ఉండేది. 15కిలోల బాక్సు రూ.వెయ్యికిపైగానే పలికాయి. వారం, పదిరోజుల పాటు ఇదే పరిస్థితి ఉండింది. ఆ తరువాత సీన్ రివర్స్ అయింది. ధరలు పూర్తిగా పడిపోయాయి. తీవ్రస్థాయిలో రైతులు నష్టపోయారు. కూలీల ఖర్చులు కూడా దక్కలేదు. ఈక్రమంలో ఎక్కడపడితే అక్కడ రైతులు కాయలను పడేశారు. కొంతమంది తోటల్లోనే పశువులకు వదిలేశారు. గిట్టుబాటు ధర కోసం రోడ్డెక్కి నిరసనలు కూడా చేశారు.

అన్నదాతల్లో ఆనందం

ప్రస్తుతం మార్కెట్‌లో టమోటా ధరలు బాగానే పలుకుతున్నాయి. దీంతో మార్కెట్‌కు వచ్చే రైతులు గతేడాది నష్టాలను చెబుతూనే.. ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. బాక్సు రూ.250కిపైగా పలికితే నష్టం ఉండదన్న రైతులు పేర్కొంటున్నారు. మార్కెట్‌లో (మిగతా 6లో..)

ఇప్పుడిప్పుడే ధరలు పలుకుతున్నాయి

రెండెకరాల్లో టమోటా సాగు చేశా. ఏడో కోత కోశా. 104 బాక్సులు అయ్యాయి. గ్రేడింగ్ చేసిన కాయలు మార్కెట్‌కు తెచ్చా. 77బాక్సులు రూ.500తో అమ్ముడుపోయాయి. మిగిలినవి రూ.250తో వేలంలో పలికాయి. ఈ రోజు అయితే ధర బాగానే పలికాయి. ముందుకోతలో ఈ రేట్లు లేవు. బాక్సు రూ.300లు, రూ.400తో అమ్ముడుపోయాయి. ఇప్పుడిప్పుడు ధరలు పలుకుతున్నాయి. ఇదే విధంగా ఉంటే రైతులకు మేలు జరుగుతుంది.

- చిరంజీవి, రైతు, అపిలేపల్లి, కుందుర్పి మండలం



మట్టి బకాసురుల బరితెగింపు..!

కొండలు, గుట్టలను కొల్లగొడుతున్న వైనం

ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు.. టిప్పర్లతో తరలింపు

యథేచ్ఛగా దందా.. కళ్లు మూసుకున్న అధికారులు

ధర్మవరం రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మట్టి బకాసురులు బరితెగిస్తున్నారు. మట్టి కోసం ఏకంగా కొండలు, గుట్టలనే కొల్లగొడుతున్నారు. వాటిని తవ్వేసి, ఆ మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దర్జాగా మట్టి తరలిస్తున్నా అధికారులు అటువైపు కన్నెత్తిచూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. మండలంలోని మల్లాకాల్వ, ఓబుళనాయునిపల్లి, సుబ్బరావుపేట, అప్రాచెరువు వంక సమీపంలోని కొండలు, గుట్టల్లోని, వంకల్లో మట్టిని దర్జాగా తరలిస్తున్నారు. గతంలో కూడా రావులచెరువు చెరువు నుంచి అధికంగా మట్టిని తరలించినట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. ప్రధానంగా మల్లాకాల్వ సమీపంలోని కొండలో చెట్లను పెకలించి మట్టిని తరలిస్తున్నారు. ఆదివారం వస్తేచాలు అధికారులు ఉండరని రెచ్చిపోతున్నారు. రోజంతా ట్రాక్టర్లు, టిప్పర్లతో మట్టిని తోలుతున్నట్లు సమాచారం. మల్లాకాల్వ, ఓబుళనాయునిపల్లి సమీపంలో కొండలో నుంచి మట్టి తవ్వి తరలిస్తున్నారు. ట్రాక్టర్ మట్టి ధర రూ.1300 నుంచి రూ.1500 వరకు పలుకుతోంది. టిప్పర్ ధర రూ.7వేల నుంచి రూ.8వేల వరకు ఉన్నట్లు తెలుస్తోంది.



మల్లాకాల్వ సమీపంలో ఎక్స్‌కవేటర్‌తో మట్టి తవ్వకాలు

కన్నెత్తి చూడని అధికారులు

కొండలు, గుట్టలు, వంకలు, చెరువులు ఎక్కడ పడితే అక్కడ మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. అనుమతులు ఉండవు, నిబంధనలు పాటించరు. కొండల్లో పగలే తవ్వకాలు చేపడుతున్నారు. ఎక్స్‌కవేటర్లతో తవ్వి, టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. పగలే, పబ్లిక్‌గానే మట్టి తోలుతున్నారు. అయినా పోలీసులు, రెవెన్యూ, గనులశాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దర్జాగా మట్టిని తోలుకుంటున్నా అధికారులు కళ్లు మూసుకుంటుండడం గమనార్హం.

చర్యలు తీసుకుంటాం: సురేష్‌బాబు, తహసీల్దార్, ధర్మవరం

మండలంలో మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకుంటాం. మట్టి తవ్వే ప్రాంతాలకు అధికారులను పంపి, విచారణ చేయిస్తాం. అక్రమార్కులపై చర్యలు తీసుకుంటాం.

మోక్షం ఎప్పుడో..?



నివార్ తుఫాన్ సమయంలో కొట్టుకుపోయిన వంతెన

మద్దిలేరు వంతెన కోసం ప్రజల నిరీక్షణ

వర్షాలకు దెబ్బతిని కొట్టుకుపోతున్న బ్రిడ్జి

తాత్కాలిక మరమ్మతులతో సరి

ముదిగుబ్బ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దిలేరు వంతెన నిర్మాణం కోసం వేల మంది ఎదురు చూస్తున్నారు. వంతెన పూర్తిగా దెబ్బతిని ఐదేళ్లు గడిచినా కొత్తదానికి మోక్షం కలగడం లేదు. దీంతో వాహనదారులు దెబ్బతిన్న వంతెనపై భయంభయంగా ప్రయాణిస్తున్నారు. నల్లమాడ నుంచి పులివెందుల వైపు, తలుపుల మండలానికి ఈ మార్గంలోనే వెళ్లాలి. కదిరి నుంచి మల్లేపల్లికి ఉదయం ఒకసారి, సాయంత్రం ఒకసారి ఆర్టీసీ బస్సు సర్వీస్ తిరుగుతుంది. లో లెవెల్ వంతెన కావడంతో మద్దిలేరు వాగు ప్రవహించినప్పుడు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ముదిగుబ్బ, తలుపుల మండలాలలో దాదాపు 25 గ్రామాల ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో మరో 10 కిలోమీటర్లు చుట్టేసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

తాత్కాలిక మరమ్మతులతోనే...

ముదిగుబ్బ-కదిరి సరిహద్దులో ఉన్న మద్దిలేరు వంతెన 2021లో నివార్ తుఫాన్ వల్ల కురిసిన అధిక వర్షాలతో పూర్తిగా కొట్టుకుపోయింది. అంతకు ముందే ఒకసారి తాత్కాలిక వంతెన కొట్టుకుపోవడంతో మట్టితో మరమ్మతులు చేశారు. నివార్ తుఫాన్ సమయంలో పూర్తిగా కొట్టుకుపోయింది. ఆ తర్వాత సిమెంటు పైపులు, రాళ్లు, మట్టి వేసి తాత్కాలికంగా రోడ్డు వేశారు. అయినా వర్షాలు ఎక్కువ వచ్చిన ప్రతిసారి కొట్టుకుపోతూనే ఉంది.

ఇప్పుడైనా వంతెన నిర్మాణం జరిగేనా..?

మద్దిలేరు వాగుపై హైలెవెల్ వంతెన నిర్మించేందుకు పంచాయతీరాజ్ అధికారులు ఏడాదిన్నర కిందట రూ.7.5 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. మలకవేమల క్రాస్‌కు వెళ్లే రెండో వంతెన దగ్గర మరో వంతెన నిర్మించేందుకు రూ.4కోట్లతో ప్రతిపాదించారు. నేటికి నిధులు మంజూరు కాలేదు. రానున్న వర్షా కాలంలో మద్దిలేరు వాగు ప్రవహిస్తే తాత్కాలిక వంతెన మళ్లీ కొట్టుకుపోయే ప్రమాదం ఉంది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఈ వంతెనను ప్రస్తుత ప్రభుత్వమైనా నిర్మించి 25 గ్రామాల ప్రజలకు ప్రయాణం సులభతరం చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

మళ్లీ కొట్టుకుపోతుందేమో..



మద్దిలేరు వంతెన నిర్మాణం కోసం 25 గ్రామాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి వెళ్లినా ప్రతిపాదనలతోనే సరిపెడుతున్నారు. నవంబరులో వచ్చే వర్షాలకు తాత్కాలిక వంతెన మళ్లీ కొట్టుకుపోతుందేమోననే భయం ఏర్పడుతోంది. నిధులు మంజూరు చేసి శాశ్వత పరిష్కారం చూపాలి.

- చినగాని నరసింహ యాదవ్, మద్దన్నగారిపల్లి గ్రామస్థుడు

వణుకు పుడుతోంది..



గ్రామం నుంచి మలకవేమల, ముదిగుబ్బ, కదిరికి ఈ వంతెనపైనే ప్రయాణించాల్సి వస్తోంది. ఆటోలు, బైకులపై వెళ్లాలంటే భయంగా ఉంటోంది. వంతెనపై ప్రయాణం అంటేనే వణుకు పడుతోంది. సంబంధిత అధికారులు బ్రిడ్జి నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.

- గంగమోహన్, దిగువపల్లి గ్రామస్థుడు

ఆశగా ఎదురు చూస్తున్నాం



బ్రిడ్జి నిర్మిస్తే ప్రయాణం సులభతరం అవుతుంది. బ్రిడ్జి నిర్మిస్తారని ఆశగా ఎదురుచూస్తున్నాం. రాత్రి సమయాలలో అత్యవసరంగా ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు వంతెన వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నిధులు మంజూరు చేసి బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి.

- చలమప్ప, ఆకుతోటపల్లి

ప్రతిపాదనలు పంపాం

కదిరి- మద్దిలేరు వాగుపై రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తాత్కాలిక మరమ్మతులు చేపట్టాం. హై లెవెల్ వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైతే వంతెన పనులు చేపడతాం.

- రాజేంద్ర ప్రసాద్, పీఆర్ ప్రాజెక్ట్ ఏఈఈ



నాటికలో ఓ సన్నివేశం

అలరించిన చిన్నారుల ప్రదర్శన

పుట్టపర్తి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బాలవికాస్ చిన్నారులు చేపట్టిన సంగీత సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. హరియాణా, చండీఘర్ భక్తులు పర్తియాత్ర పేరిట సోమవారం ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంతు సభామండపంలో బాలవికాస్ చిన్నారులు కరిస్సియే వచనం సేవ పేరిట నాటికను ప్రదర్శించారు. నాటికలోని పాత్రధారులు తమ నటనతో భక్తులకు ఆహ్లాదం కలిగించారు. ఆ రెండు రాష్ట్రాల సేవాదళ్ స్టేట్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ సంగీత భట్నాగర్ చేపట్టిన సేవా కార్య క్రమాలను వివరించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

మగ్గానికి కరెంటు ఫ్రీ



చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు ఉచితం

హామీని నిలబెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం

ఈనెల 1వతేదీ నుంచే అమలు

7న ప్రకటించనున్న సీఎం చంద్రబాబు

నేతన్నల హర్షాతిరేకాలు

ధర్మవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నేతన్నలకు ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసింది. అంధకారంలో ఉన్న మగ్గాలకు వెలుగులు పంచాలని నిర్ణయించింది. ఉచిత విద్యుత్ పథకానికి శ్రీకారం చుట్టింది. దీనిని జాతీయ చేనేత దినోత్సవం రోజు(ఈనెల 7న) ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారికంగా ప్రకటించనున్నారు. అంతుకుముందే ఈనెల 1వ తేదీ నుంచే ఉచిత విద్యుత్‌ను వర్తింపజేయనున్నారు. పవర్ లూమ్స్‌కు 500 యూనిట్లు, చేనేత కార్మికులకు 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా ఇస్తామని సీఎం చంద్రబాబు ఇటీవల మంత్రివర్గ సమావేశంలో ప్రకటించారు. ఆ మేరకు ఉచిత విద్యుత్‌పై ఆమోద ముద్ర వేసిన విషయం తెలిసిందే. దీంతో జిల్లాలోని చేనేత కార్మికుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

వైసీపీ పాలనలో నిర్లక్ష్యం

గత వైసీపీ ప్రభుత్వం.. చేనేత కార్మికులకు రూ.24 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంది. మిగతా ఎలాంటి ప్రోత్సాహకాలూ ఇవ్వలేదు. ఫలితంగా రంగులు, రసాయనాలు, జరీ ధరలు విపరీతంగా పెరిగాయి. మగ్గం గిట్టుబాటుకాక ఉత్పత్తి తగ్గించడంతో కార్మికులకు పనిలేక రోడ్డున పడ్డారు. అప్పులతో కాలం వెల్లదీశారు. కొందరైతే మగ్గాన్ని వీడి కూలి పనులకు వెళ్లారు. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముందు యువగళం పాదయాత్రలో భాగంగా నారా లోకేశ్.. ధర్మవరంలో చేనేత కార్మికులతో సమావేశమయ్యారు. నేతన్నల అభ్యర్థన మేరకు ఉచిత విద్యుత్‌పై హామీ ఇచ్చారు. తాజాగా అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు నేతన్నల ఇళ్లకు ఉచితంగా 200 యూనిట్లు, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్లు విద్యుత్ అందించనున్నట్లు ప్రకటించారు. జిల్లాలో 20 నుంచి 25వేల వరకు మగ్గాలున్నాయి. 30 వేల నుంచి 35వేల వరకు కార్మికులు ఉన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కుటుంబాలకు ఈనెల 7వ తేదీన ఉచిత విద్యుత్ అందించాలని ముందుగా నిర్ణయించినా సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు వారం రోజుల ముందు అంటే ఈనెల 1 నుంచే పథకాన్ని అమలు చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నేతన్నలకు నెలకు 100 యూనిట్లు విద్యుత్ మాత్రమే ఉచితంగా ఇచ్చింది. ప్రస్తుతం 200 యూనిట్ల వరకు ఉచితంగా ఇస్తుండడంతో ప్రతి కుటుంబానికి నెలకు రూ.700 నుంచి రూ.1200 వరకు లబ్ధి చేకూరనుందని విద్యుత్ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. అంతకుమించి వాడిన దానికి బిల్లు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ధర్మవరం, ముదిరెడ్డిపల్లి, సోమందేపల్లి, గోరంట్ల, హిందూపురం ప్రాంతాల్లో చేనేత కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పటికే చేనేత కుటుంబాల వివరాలను సేకరిస్తున్న జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారులు త్వరలోనే అర్హులకు ఉచిత విద్యుత్ వర్తింపజేసేలా చర్యలు చేపడుతున్నారు.



మగ్గం నేస్తున్న కార్మికుడు

ఆర్థిక భారం తగ్గుతుంది



20 ఏళ్లుగా మగ్గం నేస్తున్నా. గతంతో 100 యూనిట్లు మాత్రమే ఉచితంగా ఇచ్చేవారు. అది మగ్గానికి సరిపోయేది కాదు. అదనంగా బిల్లు చెల్లించాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం నెలకు 200 యూనిట్లు ఉచితంగా ఇవ్వనుండడంతో ఆర్థిక భారం తగ్గనుంది.

-రామాంజి, చేనేత కార్మికుడు, హమాలీకాలనీ, ధర్మవరం

నేతన్నల వివరాలు ప్రభుత్వానికి పంపాం

నేతన్నలకు ఉచిత విద్యుత్ పథకాన్ని సీఎం చంద్రబాబునాయుడు ఈనెల 7వతేదీ ప్రకటిస్తారు. ఈనెల 1వ తేదీ నుంచే అమల్లోకి వస్తుంది. 7వతేదీ తరువాత ఉచిత విద్యుత్‌కు ఎవరెవరు అర్హులో తేలనుంది. జిల్లాలో చేనేత కార్మికుల సంఖ్య, విద్యుత్ కనెక్షన్లు తదితర వివరాలు సేకరించి ప్రభుత్వానికి పంపాం.

-రామకృష్ణ, చేనేత జౌళిశాఖ ఏడీ, శ్రీసత్యసాయి జిల్లా

టమోటాకు టైమొచ్చింది..!

(5వ పేజీ తరువాయి)

మేలిరకం కాయలు బాక్సు రూ.500కిపైగానే పలుకుతున్నాయి. రెండోరకం రూ.400 వరకు అమ్ముడుపోతున్నాయి.

ధరలు బాగున్నాయి



రెండు విడతలుగా నాలుగెకరాల్లో టమోటా సాగు చేశా. రెండో కోత కోసి 40 బాక్సులు మార్కెట్‌కు తీసుకొచ్చా. బాక్సు రూ.570తో అమ్ముడుపోయాయి. ఇందులో ఖర్చులుపోను బాక్సుకు రూ.500 వస్తుందని అనుకుంటున్నా. ప్రస్తుతం ధరలు బాగున్నాయి. రానున్న రోజుల్లో ఎట్లుంటదో చూడాలి.

- నరసింహులు, రైతు, కమ్మూరు, కూడేరు మండలం

నిరుడు రూ.3లక్షలకుపైగా నష్టపోయా



గతేడాది టమోటా సాగుతో రూ.3లక్షలకుపైగా నష్టపోయా. ప్రస్తుతం రెండు విడతలుగా మూడెకరాల్లో పంట పెట్టా. రూ.లక్షకుపైగా పెట్టుబడులకు వెచ్చించా. మొదటి విడత సాగులో దిగుబడులు వస్తున్నాయి. ఇప్పటికి ఏడో కోత కోశా. 120 బాక్సులు అయ్యాయి. ఇందులో 105బాక్సులు రూ.520తో అమ్ముడుపోయాయి. మరో తొమ్మిది బాక్సులు వందతో అమ్ముడుపోగా.. మాగిన కాయ లు మూడుబాక్సులు రూ.300తో విక్రయించా. ఇదే విధంగా ధరలుంటే నష్టాల నుంచి బయటపడతాం.

- రాజన్న, రైతు, యర్రమల్లెపల్లి, కంబదూరు మండలం

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

ధర్మవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి)): పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో ఈనెల 18,19 తేదీల్లో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, డైరెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ హర్షవర్ధన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2022-25 మధ్య డిగ్రీ, బీటెక్ పూర్తీ చేసిన విద్యార్థుల కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని అన్నారు. ఈనెల 11,12,13 తేదీల్లో హైదరాబాద్ నుంచి కంపెనీ ప్రతినిధులు వచ్చి కళాశాలలో ఉచిత శిక్షణ ఇస్తారన్నారు.

పలు మండలాల్లో వర్షం

కొత్తచెరువు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లాలో ఆదివారం రాత్రి పలు మండలాల్లో వర్షం కురిసింది. రొళ్ల మండలంలో 30.4 మి.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది. బత్తలపల్లిలో 24.6 మి.మీ., బుక్కపట్నం 26.2 మి.మీ. వర్షపాతం నమోదయింది. మూడు మండలాల్లో 2.25 మి.మీ., ఒక మండలంలో 5మి.మీ., మరికొన్ని మండలాల్లో తేలికపాటిటి వర్షం కురిసిందని కొత్తచెరువు ఏఎస్ఓ గంగాధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

గుంతకల్లు మీదుగా వెలంకనికి ప్రత్యేక రైలు

గుంతకల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని నాగపట్నంలో వెలసిన వెలంకని ఆరోగ్యమాత ఉత్సవాలను పురస్కరించుకుని గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బాంద్రా టెర్మినస్-వెలంకని ప్రత్యేక రైలు (09093) ఈ నెల 27, సెప్టెంబరు ఆరో తేదీల్లో రాత్రి 9-40 గంటలకు బాంద్రా టెర్మినస్‌లో బయలుదేరి రెండో రోజు ఉదయం 7-40 గంటలకు వెలంకనికి చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (09094) వెలంకనిలో ఈ నెల 30, సెప్టెంబరు 9 తేదీల్లో అర్ధరాత్రి 12-30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం పదిన్నరకు బాంద్రా టెర్మినస్‌కు చేరుకుటుందన్నారు. ఈ ప్రత్యేక రైలు బోరివాలి, వసాయ్ రోడ్, పన్వేల్, లోనావాలా, పూనా, దౌండ్, షోలాపూర్, కలబురగి, వాడి, యాద్గిర్, క్రిష్ణా, రాయచూరు, మంత్రాలయం రోడ్, ఆ దోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట, కాట్పాడి, వెల్లూర్ కంటోన్మెంటు, తిరువన్నమల్లై, విల్లుపురం, మయిలదుతురై స్టేషన్ల మీదుగా నాగపట్నం చేరుకుంటుందన్నారు.

వేధింపుల ఉపాధ్యాయుడిపై వేటు?

అనంతపురం విద్య, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): విద్యార్థిని పట్ల అసభ్యంగా వ్యవహరించిన టీచర్ వేమనారాయణపై సస్పెన్షన్ వేటుపడినట్లు తెలిసింది. విద్యాశాఖ అధికారులు చెబుతున్న వివరాలిలా ఉన్నాయి. బ్రహ్మసముద్రం మండలం గుండిగానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేమనారాయణ తెలుగు టీచర్‌గా పనిచేస్తున్నాడు. అదే పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. విద్యార్థిని.. తల్లిదండ్రులకు విషయం తెలిపింది. దీంతో వారు.. గ్రామస్థులతో కలిసి మూడురోజుల క్రితం పాఠశాలకు వెళ్లి ఆ టీచర్‌ను తీవ్రంగా మందలించడంతోపాటు హెచ్‌ఎంకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం.. జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో సైతం వైరల్ అయింది. రాష్ట్ర, జిల్లాస్థాయి ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలిచ్చారు. ఆ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారులు సోమవారం టీచర్ వేమనారాయణను సస్పెండ్ చేస్తూ ఫైల్ సిద్ధం చేశారు. డీఈఓ ప్రసాద్‌బాబు సెలవులో ఉండడంతో ఆయన వచ్చిన తర్వాత ఆమోదం తీసుకుని, ఉత్తర్వులు ఇస్తారా.. కలెక్టర్‌కు ఫైల్ పెట్టి అక్కడ ఆమోదం వేయించుకుని జారీ చేస్తారా అనేది తేలాల్సి ఉంది. మొత్తం మీద విద్యార్థినిని వేధించిన టీచర్‌పై వేటు పడింది. ఇది విద్యాశాఖ, ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

పులకించని మది పులకించె..!

(5వ పేజీ తరువాయి)

డ్రా చేసుకునేందుకు వచ్చిన రైతులతో బ్యాంకులలో సోమవారం సందడి నెలకొంది. శనివారం ఆలస్యం కావడం, ఆదివారం సెలవు కావడంతో డబ్బులు డ్రా చేయలేకపోయారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం బ్యాంకులకు క్యూ కట్టారు. ఖరీఫ్ సీజన్ ఆరంభమయ్యాక అన్నదాత సుఖీభవ సొమ్ము కోసం రైతులు ఎదురుచూశారు. విత్తనం, ఎరువులు, కూలీల ఖర్చులకు డబ్బులు అవసరం కావడంతో కొందరు అప్పు చేశారు. తాజాగా ప్రభుత్వం ఇచ్చిన సొమ్ముతో కొందరు చేసిన అప్పులను తీరుస్తున్నారు.

ఎక్కడెక్కడ ఎంత..?

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా అనంతపురం జిల్లాలోని 31 మండలాల పరిధిలో 2,75,642 మంది రైతులకు తొలివిడత రూ.192.94 కోట్లు జమ అయింది. ఇందులో అన్నదాత సుఖీభవ కింద రూ.137.82 కోట్లు, పీఎం కిసాన్ ద్వారా రూ.55.12 కోట్లు వచ్చింది. శ్రీసత్యసాయి జిల్లాలోని 32 మండలాల పరిధిలో 2,65,040 మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.132.52 కోట్లు జమ అయింది. పీఎం కిసాన్ పథకం కింద 2,41,774 మంది రైతులకు కేంద్ర ప్రభుత్వం మరో రూ.48.35 కోట్లు వచ్చింది. ఈ జిలాలోఓ మొత్తం రూ.180.87 కోట్లు రైతులకు అందింది.



అన్నదాత సుఖీభవ సొమ్ముకోసం శింగనమల కెనరా బ్యాంకుకు వచ్చిన రైతులు





డ్రా చేసుకున్న డబ్బును చూపుతున్న శింగనమల మండల రైతులు

రైతులకు వరం..



అన్నదాత సుఖీభవ పథకం మాకు వరం. పంటల సాగుకు పెట్టుబడులు వీపరీతంగా పెరిగాయి. విత్తనాలు, ఎరువులు, సేద్యపు పనులకు అప్పులు చేయాల్సి వస్తోంది. ఇలాంటి సమయంలో ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రూ.7 వేలు ఇచ్చింది. ఈ కష్టకాలంలో మాకు ఊరట లభిస్తోంది.

- నరసింహారెడ్డి, తుమ్మల, ధర్మవరం మండలం

కూలీల ఖర్చుకు వస్తాయి..



అన్నదాత సుఖీభవ పేరిట సాయం అందించి, చంద్రబాబు రైతు పక్షపాతి అని నిరూపించుకున్నారు. పంటలు పెట్టాలంటే కూలీలకు, మందులకు విపరీతంగా ఖర్చులు వస్తున్నాయి. ప్రభుత్వం ఏడాదికి రూ.20 వేలు ఇవ్వడం, మొదటి విడద కింద రూ.7 వేలు జమచేయడం సంతోషానిచ్చింది. కూలీల ఖర్చు భయం లేకుండా పోయింది. లేదంటే కూలీలకు ఇచ్చేందుకు అప్పు చేసేవాళ్లం. రైతులకు సీఎం మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకురావాలి.

-గుత్తా సూర్యనారాయణ, ఏలుకుంట్ల, ధర్మవరం మండలం

పెట్టుబడులకు ఉపయోగం..



వ్యవసాయ పెట్టుబడులకు అన్నదాత సుఖీభవ నగదు ఉపయోగపడుతుంది. ప్రతి సంవత్సరం పంటలు సాగుచేసే సమయానికి అప్పులు చేస్తున్నాం. ఇప్పుడు ప్రభుత్వం నగదు విడుదల చేసింది. పెట్టుబడులకు ఎంతోగానో ఉపయోగపడుతుంది. నా బ్యాంకు ఖాతాలో రూ.7 వేలు జమ అయింది. ఎంతో సంతోషంగా ఉంది.

-నరసింహుడు, సంజీవపురం, బత్తలపల్లి

సరైన సమయంలో..



ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు అన్నదాత సుఖీభవ డబ్బులు ఇచ్చారు. అన్నదాత కష్టాలు తెలిసిన నాయకుడు ఆయన. మమ్మల్ని ఆదుకునేందుకు సరైన సమయంలో డబ్బులు విడుదల చేశారు. పంటల పెట్టుబడులకు ఈ సొమ్మును వాడుకుంటాం. బ్యాంకు ఖాతాలో సొమ్ము పడిందని తెలియగానే మా రైతులంతా ఎంతో సంతోషంగా కనిపిస్తున్నారు. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు.

-పెద్దినేని వెంకటాద్రి, రైతు, నల్లచెర్లోపల్లి, ముదిగుబ్బ మండలం

ప్రభుత్వంతో జేఎన్‌టీయూ ఎంఓయూ




మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో ఎంఓయూ కుదుర్చుకుంటున్న జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ క్రిష్ణయ్య తదితరులు

అనంతపురం రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ, రాష్ట్ర ప్రభుత్వంతో ఎంఓయూ కుదుర్చుకున్నట్లు వర్సిటీ వీసీ ఆచార్య సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఆచార్య క్రిష్ణయ్య తెలిపారు. విజయవాడలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమక్షంలో ప్రభుత్వ కార్యదర్శి గిరిబాబు, అడిషనల్ సెక్రటరీ ఫర్ లేబర్ గంధం చంద్రుడు లతో జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, డీఏపీ ఆచార్య సత్యనారాయణ సోమవారం సమావేశమై ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. యూనివర్సిటీలో ఉన్న కెమికల్, మెకానికల్, ఎలక్ట్రానికల్ ఫ్యాకల్టీ ఎక్స్‌పర్ట్‌లను ఉపయోగించుకుని పరిశ్రమల్లో సేఫ్టీ ప్రోగామ్స్‌ను మానిటరింగ్ చేస్తారన్నారు. టెక్నికల్ నాలెడ్జ్‌లను, పరిశోధనలకు సంబంధించిన సేఫ్టీ ఎక్విప్‌మెంట్‌ను వాడుకుంటారన్నారు. సేఫ్టీ అడిట్ రిపోర్టును పరీక్షించడం, అధ్యయనం చేయడం, దానికి కావలసిన చేర్పులు, మార్పులు చేయడానికి ఈ ఒప్పందం ఉపయోగపడుతుందన్నారు. దీని వల్ల డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వాళ్ల కావలసిన రీసెర్చ్, ఎక్విప్‌మెంట్‌కు ఆర్థిక సాయం చేస్తారని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఇప్పిస్తారన్నారు. కార్యక్రమంలో డైరెక్టరేట్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మోహన్‌రావు, ఉష్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

అనంతపురం వైద్యం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మల్టీపర్పస్ హెల్త్ వర్కర్(ఏఎన్‌ఎం) కోర్సుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ ఏఎన్‌ఎం శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ యశోదమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల కోర్సుకు మహిళలు మాత్రమే అర్హులన్నారు. అభ్యర్థులు ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ https://cfw.ap.nic.in/ ద్వారా దరఖాస్తుల చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9491939451, 9446941113 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

పుట్టపర్తిలో భారీ వర్షం



పుట్టపర్తిలో రహదారిపై పారుతున్న వర్షపు నీరు

పుట్టపర్తిరూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రం పుట్టపర్తిలో సోమవారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. గతకొంతకాలంతో ఊరిస్తూ ఉసూరుమనిపిస్తున్న మేఘాలు సోమవారం రాత్రి భారీ వర్షం కురిపించాయి. దీంతో పట్టణంలోని రహదారులన్నీ మోకాలులోతు నీటితో జలమయమయ్యాయి. అలాగే హిందూపురం, గుడిబండ, కొత్తచెరువు, పెనుకొండ, గోరంట్లలలో ఓమోస్తరు వర్షం కురిసింది.

8 మంది మట్కా బీటర్ల అరెస్టు

అనంతపురం క్రైం,ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ఎనిమిది మంది మట్కా బీటర్లు, నిర్వాహకులను అరెస్టు చేసినట్టు టూటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. సోమవారం సీఐ శ్రీకాంత్ యాదవ్, ఎస్ఐ రుషేంద్రబాబు.. నిందితుల వివరాలను టూటౌన్‌లో ప్రకటించారు. మట్కా సమాచారం రావడంతో సాయినగర్ 2వ క్రాస్‌లో తనిఖీలు చేశామన్నారు. ఈ సందర్భంగా మట్కా నిర్వహిస్తున్న వారిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి నగదు రూ.1.50 లక్షలు, మట్కా చీటీలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

తల్లిపాలు బిడ్డ హక్కు

జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తల్లి పాలు బిడ్డ హక్కు అని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ తల్లిపాల వారోత్స వాలు-2025ను ఘనంగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ఈనెల 1 నుంచి ఏడో తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించాలన్నారు. తల్లి పాలు బిడ్డకు తొలి టీకా అన్నారు. జీవితానికి కవచం- ఆరోగ్య భవితకు బలమైన పునాది అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్ఓ మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ అధికారి రామకృష్ణారెడ్డి, ఐసీడీఎస్ పీడీ నాగమణి, వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీలు నిర్వహించాలి

పతి నెలా ఐదో తేదీన అన్ని సచివాలయాల పరిధిలో వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీలను నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూభవన్‌లో పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో జీఓఏపీ, మన మిత్ర-ప్రజలచేతిలో ప్రభుత్వం అనే పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. తర్వాత ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్‌ను తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఒక నెంబర్‌ద్వారా 200కు పైగా సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. 9552300009 నంబర్‌పై అవగాహన కల్పించాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై ర్యాలీలలో వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లు, అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్ అసిస్టెంటు, ఏఎన్ఎంలు పాల్గొని అవగాహన కల్పించాలన్నారు.

7న ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

పుట్టపర్తి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): సత్యసాయి విద్యాసంస్థల పూర్వ విద్యార్థులు నిర్వహిస్తున్న శ్రీసత్యసాయి పాలియేటివ్ కేర్ సెంటర్‌లో ఈనెల 7న క్యాన్సర్ ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పెద్దకమ్మవారిపల్లి రోడ్డులో గల ఆస్పత్రిలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షలను 35 సంవత్సరాలు దాటిన మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందస్తుగా 8047103700 నంబరుకు ఫోన్ చేసి పేరు నమోదు చేసుకోవాలని వారు కోరారు.

9 నుంచి రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్



ఎంపికైన దివ్యాంగ క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పారా జూనియర్, సబ్‌జూనియర్ అథ్లెటిక్స్ పోటీలు ఈనెల 9 నుంచి ప్రారంభమవుతాయని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు విశాఖపట్నంలోని పోలీస్ బ్యాక్‌గ్రౌండ్‌లో నిర్వహిస్తారన్నారు. జిల్లా నుంచి 40మంది ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల ఏడున విశాఖపట్నానికి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి విజేతలుగా రావాలని ఆకాంక్షించారు.

టీటీడీసీని సందర్శించిన కేంద్ర బృందం

అనంతపురం అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నగర శివారు పంగల్ రోడ్డు సమీపంలోని టీటీడీసీ శిక్షణాకేంద్రాన్ని కేంద్ర పథకాల పర్యవేక్షణ బృందం అధికారులు సాంబశివరావు, నవ్య సందర్శించారు. సోమవారం జిల్లా పర్యటనకు వచ్చిన కమిటీ సభ్యులు తొలిరోజు టీటీడీసీ శిక్షణా కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలు.. తద్వారా సాధించిన ఫలితాలపై ఆరాతీశారు. అనంతరం ఎస్కేయూ సమీపంలోని రూడ్ సెట్ కేంద్రాన్ని సందర్శించి, అక్కడ నిర్వహించే ఉచిత శిక్షణలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈనెల 13వ తేదీదాకా జిల్లాలోని పలు ప్రాంతాల్లో కమిటీ సభ్యులు పర్యటించనున్నారు. ఆయా గ్రామాల్లో పలు రకాల పనులను పరిశీలిస్తారు. మంగళవారం గుంతకల్లు మండలం దోసలుడికి, ఈనెల 6న కొంగనపల్లి, 7న నాగసముద్రం, 8న పుట్లూరు మండలం అరకటివేముల, 9న మడ్డిపల్లి, 10న మడుగుపల్లి, 11న విడపనకల్లు మండలం పాల్తూరు, 12న జనార్దనపల్లి, 13న కలెక్టరేట్‌లో సంబంధితశాఖల అధికారులతో సమావేశమవుతారు.

కేంద్ర బృందానికి సహకరించండి..

జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను పర్యవేక్షించేందుకు వచ్చిన జాతీయస్థాయి మానిటరింగ్ బృందానికి సహకారం అందించాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ.. అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన నేషనల్ లెవల్ మానిటరింగ్ బృందం, డ్వామా, సంబంధిత శా ఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోమవారం నుంచి ఈనెల 13 వరకు నేషనల్ లెవల్ మానిటర్ టీం జిల్లాలో పర్యటిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధిదారులతో మాట్లాడి విజయగాథల వివరాలను వారికి తెలపాలన్నారు. సమావేశంలో కేంద్ర బృందం అధికారులు సాంబశివరావు, నవ్య, డ్వామా పీడీ సలీం బాషా, జడ్పీ సీఈఓ శివశంకర్, డీపీఓ నాగరాజు నాయుడు, హౌసింగ్ పీడీ శైలజ, డీఆర్‌డీఏ పీడీ గంగాధర్, సత్యనారాయణ, సర్వే ఏడీ రూప్లానాయక్ పాల్గొన్నారు.

ఊసేలేని ఉద్యాన ప్రగతి..!

- ఫిబ్రవరిలో అట్టహాసంగా అనంత ఉద్యాన సమ్మేళనం
- ఐదు నెలలు ముగిసినా అతీగతీ లేదు
- ఏడు కంపెనీలతో ఒప్పందాలు
- క్షేత్రస్థాయిలో మొదలుకాని పనులు
- అయోమయంలో రైతులు

అనంతపురం అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అనంతను ఉద్యాన హబ్‌గా తీర్చిదిద్దాలన్నది ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సంకల్పం. ఆ దిశగానే ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారంలో జిల్లా కేంద్రంలో అనంత ఉద్యాన సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య ప్రజాప్రతినిధులతోపాటు పలు కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. జిల్లాలో ఉద్యాన పంటల సాగును మరింతగా ప్రోత్సహించేందుకు ఉద్యాన సమ్మేళనంలో 7 కంపెనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. దీనిని ఆదర్శంగా తీసుకుని ఇతర జిల్లాల్లోనూ కార్యక్రమాలు నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించడం విశేషం. ఉద్యాన సమ్మేళనంలో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడంపై అశ్రద్ధ వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే... ప్రజాప్రతినిధులు ఆర్భాటంగా పెద్దపెద్ద కంపెనీల ప్రతినిధులను ఆహ్వానించి, నిర్వహించిన ఉద్యాన సమ్మేళనం లక్ష్యం నెరవేరడం కష్టమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. జిల్లా యంత్రాంగం అట్టహాసంగా ఉద్యాన సమ్మేళనం నిర్వహించడంతో తమకు ప్రయోజనం చేకూరుతుందని ఉద్యాన రైతులు భావించారు. సమ్మేళనంలో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో నిర్దేశించిన పనులు మొదలు పెట్టకపోవడంతో అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు.

● అతీగతీ లేదాయె..

రాష్ట్రస్థాయిలో ఎన్నడూలేని విధంగా అనంత ఉద్యాన సమ్మేళనం నిర్వహించారు. ఐదు నెలలు ముగిసినా ఉద్యాన సమ్మేళనంలో తీసుకున్న నిర్ణయాలు అమలు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. సమ్మేళనంలో అనంత ఉద్యాన పంటల ప్రాముఖ్యతను వివరించారు. ఇక్కడ పండించిన ఉద్యాన ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసి, రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని నిర్ణయించారు. కోతల తర్వాత ఉద్యాన పంటల వ్యర్థాలతో పలు రకాల వస్తువులు తయారు చేసేలా చర్యలు తీసుకోవాలనుకున్నారు. ఉద్యాన సమ్మేళనంలో గ్రోత్ ఇంజిన్స్ జాబితాలో అరటి, చీనీ, దానిమ్మ, ఎండుమిరప, టమోటా పంటలుఉన్నాయి. మిగతా పంటల ఉత్పత్తులను ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి, అమలు చేయాలని నిర్ణయించారు. తొలి అనంత ఉద్యాన సమ్మేళనంలో తీసుకున్న నిర్ణయాలను క్షేత్రస్థాయిలో అమలు చేసి, వచ్చే ఏడాది తిరిగి కార్యక్రమాన్ని నిర్వహించాలనుకున్నారు. గత సమ్మేళనంలో తీసుకున్న నిర్ణయాలు.. అమలు విధానం,



అనంత ఉద్యాన సమ్మేళనంలో జిల్లా యంత్రాంగంతో ఒప్పందాలు చేసుకుంటున్న పలు కంపెనీల ప్రతినిధులు (ఫైల్)

రైతులకు ఒనగూరిన ప్రయోజనాలను తెలియజేయాలని ఉద్యాన సమ్మేళనంలో జిల్లా యంత్రాంగం నిర్ణయం తీసుకుంది. ఉద్యాన సమ్మేళనంలో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీల ప్రతినిధులతో ఈ ఏడాది మార్చిలో కలెక్టర్ వినోద్‌కుమార్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రానున్న మూడు నెలల్లో ఒప్పందం మేరకు ఏయే పనులు చేపడుతున్నారో ప్రణాళికలు తయారు చేసి, క్షేత్ర స్థాయిలో మొదలు పెట్టాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఆయా కంపెనీల ప్రణాళికలు రూపొందించినట్లు సమాచారం. ఆ మేరకు క్షేత్రస్థాయిలో పనులు మొదలు పెట్టకపోవడం గమనార్హం. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఉద్యాన సమ్మేళనం లక్ష్యం నెరవేరడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అనంత ఉద్యాన సమ్మేళనం లక్ష్యం ఘనంగా ఉన్నా... అమలు చేయడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించడం ఏమిటో అర్థం కావడం లేదు.

● కంపెనీల ఒప్పందాలివీ..

అనంత ఉద్యాన సమ్మేళనంలో 7 కంపెనీలు జిల్లా యంత్రాంగంతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. మైక్రో ఆల్గే సొల్యూషన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ (ఆల్గా ఎనర్జీ స్పెయిన్ అనుబంధ సంస్థ), సిద్ధార్థ కోల్డ్ కేర్ (అనంతపురం), కోసూరి బాలాజీ ఆగ్రో ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్ (కృష్ణా జిల్లా), గ్రీన్ గురుకులం ప్రైవేటు లిమిటెడ్ (తెలంగాణ), అగ్రో లైఫ్ సైన్స్ కార్పొరేషన్ (ఢిల్లీ), అనసా ఫిట్ న్యాచురల్ ఫైబర్ వీవర్ క్లస్టర్, ప్యూర్ ఓ న్యాచురల్ రిటైల్ ప్రైవేటు లిమిటెడ్ (హైదరాబాద్) కంపెనీలు ఉద్యాన పంటల కొనుగోలు, ఎగుమతికి సంబంధించి జిల్లా యంత్రాంగంతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

● మైక్రో ఆల్గే సొల్యూషన్స్

ఈ కంపెనీ బయో ఎరువులు, బయో ఉద్దీపనల కోసం ఆధునాతన మైక్రో ఆల్గే ఆధారిత సాంకేతికతను సమగ్ర పర్చడంలో పాల్గొంటుంది. జిల్లాలో కనీసం 10వేల మంది రైతులు మైక్రో ఆల్గే ఆధారిత బయో ఎరువులు, జీవ ఉద్దీపనలను స్వీకరించేలా చొరవ చూపుతుంది. యూపీటీ ఆధారిత బయో ఇన్‌పుట్‌ల సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు పైలెట్ ప్రాజెక్టును ఏర్పాటు చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు.

● సిద్ధార్థ కోల్డ్ కేర్

ఈ కంపెనీ పరిధిలో 300 ఎంటీ ప్రీ కూలింగ్ చాంబర్లు, 800 ఎంటీ కోల్డ్ రూమ్‌లు ఉన్నాయి. వీటిని ప్రస్తుతం ఎస్‌కే బనానా ఇతర దేశాలకు ఎగుమతి చేసేందుకు ప్రీ కూల్ చేసేందుకు వినియోగిస్తున్నారు. ఒప్పందం మేరకు సిద్ధార్థ పల్ప్, డీహైడ్రేషన్ యూనిట్లను ఏర్పాటు చేసి పండ్లు, కూరగాయలు తాజాగా ఉండేలా చర్యలు తీసుకునేలా ఒప్పందం కుదుర్చుకున్నారు.

● కోసూరి బాలాజీ ఆగ్రో ఫుడ్స్ ప్రైవేటు లిమిటెడ్

అరటి, మామిడి, సీతాఫలం తదితర ఉద్యాన పంటలను ప్రాసెసింగ్ చేస్తారు. తద్వారా రైతులు ఉద్యాన ఉత్పత్తులను లాభదాయకమైన ధరతో విక్రయించేలా చొరవ చూపేందుకు ఒప్పందం చేసుకున్నారు.

● గ్రీన్ గురుకులం ప్రైవేటు లిమిటెడ్

ఉద్యాన పంట కోతల అనంతరం తగిన సదుపాయాలు కల్పిస్తారు. జిల్లా రైతులకు మద్దతు ధర కల్పించడం, ఇతర ప్రాంతాల్లో ధరలను తెలియజేసి, కొత్త మార్కెటింగ్‌లో మద్దతు ధర లభించేలా చొరవ చూపేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ కంపెనీ పంటలకు రెయిన్ ఫారెస్ట్ అలయన్స్ (ఆర్ఎఫ్ఏ) సర్టిఫికెట్ ఇస్తుంది. దీంతో ప్రపంచంలో ఎక్కడైనా ఆయా పంటలను విక్రయించుకునే అవకాశం ఉంటుంది. పంటల సాగులో ఏయే పద్ధతులు పాటిస్తే ఆర్ఎఫ్ఏ సర్టిఫికెట్ జారీ చేస్తారు..? తదితర అంశాలపై త్వరలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.

● ఆగ్రో లైఫ్ సైన్స్ కార్పొరేషన్

ఉద్యాన పంటల్లో తెగుళ్ల నివారణకు ఏయే దశల్లో క్రిమిసంహారక మందులు వాడాలో వివరిస్తారు. మొక్కల ఎదుగుదల కోసం బయో ఎరువులను రైతులకు అందుబాటులోకి తెస్తారు. జిల్లాలోని 13 సంకల్ప్ రిటైల్ స్టోర్ల ద్వారా తక్కువ ధరకు ఎరువులను అందజేసేలా ఒప్పందం.

● అనసా ఫిట్ న్యాచురల్ ఫైబర్ వీవర్ క్లస్టర్

అరటి పంట కోత తర్వాత వ్యర్థాలను తగ్గించేందుకు చర్యలు చేపడతారు. ఈ కంపెనీ ద్వారా అరటి నుంచి వచ్చే నారతో బొమ్మలు, బ్యాగులు, టోపీలు, దుస్తులు తయారు చేసే టెక్నాలజీపై శిక్షణ ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, డీఆర్‌డీఏ, మెప్మా అధికారులతో చర్చించి, షెడ్యూల్ మేరకు ఎంపిక చేసిన డ్వాక్రా సంఘాలకు ఆ కంపెనీతో శిక్షణ ఇప్పించాలని నిర్ణయించారు.

● ప్యూర్ ఓ న్యాచురల్ రిటైల్ ప్రైవేటు లిమిటెడ్

రైతుల నుంచి నేరుగా పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తారు. స్థానిక వ్యవసాయ సంఘాలతో మమేకమై తాజా పండ్లు, కూరగాయలను కొనుగోలు చేసేలా ఒప్పందం.

క్రైం కార్నర్

కారును ఢీకొన్న లారీ.. ఐదుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన లారీ, కారు

పెనుకొండ రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరిపురం వైజంక్షన్ వద్ద 44వ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి కారును లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. కియ పోలీసులు తెలిపిన మేరకు కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన ఇంద్రజ, సుధాకర్, ఆధ్య, వీరేష్, రాఘవేంద్ర, శశికళ, యశ్వంత్, దీప్తిప్రియ రెండ్రోజుల కిందట తమిళనాడులోని అరుణాచలం శివాలయానికి వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం రాత్రి 11గంటల సమయంలో పెనుకొండ సమీపంలోని హరిపురం వైజంక్షన్ వద్ద లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి క్షతగాత్రులను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించినట్లు తెలిపారు.

అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం

- ఎస్పీ ఆఫీస్ వద్దే ఘటన
- అడ్డుకున్న పోలీసులు



పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన బాలకృష్ణ

అనంతపురం క్రైం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారులు వేధిస్తూ, తనను, తన భార్యను చంపుతామని బెదిరిస్తున్నారని ఓ ఆటో డ్రైవర్ ఎస్పీ ఆఫీస్ వద్ద సోమవారం ఆత్మహత్యకు యత్నించాడు. బాధితులు, పోలీసులు తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లికి చెందిన రంగారెడ్డి కొడుకు బాలకృష్ణ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు వచ్చాడు. తన అప్పుల సమస్యను పోలీసులకు విన్నవించుకున్నాడు. బయటకు రాగానే కాన్ఫరెన్స్ హాల్ గేటు వద్ద మొక్కల చాటున దాచి పెట్టుకున్న పెట్రోల్‌ను తనపై పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. దీన్ని అక్కడే ఉన్న పోలీసులు, ప్రజలు గమనించి అప్రమత్తమయ్యారు. వెంటనే అతడిని పక్కకు తీసుకెళ్లి కుర్చీబెట్టి నీళ్లు పోశారు. తర్వాత వివరాలు ఆరా తీశారు. కుటుంబ పోషణ కోసం అప్పులు చేశానన్నాడు. అధిక వడ్డీలు చెల్లించడం, కుటుంబ పోషణకు మళ్లీ అప్పులు చేయాల్సి వచ్చిందన్నారు. మొత్తం రూ.16 లక్షలు అప్పులు అయ్యాయన్నారు. కొంత కాలంగా వడ్డీవ్యాపారులు వేధిస్తున్నారన్నారు. నగరానికి చెందిన రాము, నారపరెడ్డి, భవానీ నగర్‌కు చెందిన వ్యక్తి, అంబారపు వీధికి చెందిన ఈశ్వరయ్య, జితేంద్ర, మరో వ్యక్తి రామయ్య ఇలా ఇంటి వద్దకు, ఆటో పెట్టుకునే చోటకు వచ్చి బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని కోరారు. సమస్యను పరిష్కరిస్తామని, బాధితుడికి తోడుగా కానిస్టేబుల్‌ను ఇచ్చి బుక్కరాయసముద్రం పంపారు.

వృద్ధురాలిని కాపాడిన పోలీసులు



ఆత్మహత్యకు పాల్పడుతున్న వృద్ధురాలిని కాపాడిన ట్రైనీ ఎస్ఐ భువనేశ్వరి

పెనుకొండ టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రైలు కింద పడబోయిన ఓ వృద్ధురాలిని పెనుకొండ పోలీసులు సోమవారం కాపాడారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు.. రొద్దం మండలం బూదిపల్లి గ్రామానికి చెందిన జయమ్మ పెనుకొండ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరగడాన్ని పెట్రోలింగ్‌కు వచ్చిన ట్రైనీ ఎస్ఐ భువనేశ్వరి, ఏఎస్ఐ నాగరాజు గుర్తించారు. రైలు కిందపడబోతున్న ఆమెను కాపాడారు. విచారించగా భర్త నారాయణప్ప, కుమారుడు, కోడలు ఒకే ఇంటిలో ఉన్నారని అనారోగ్యం కారణంతోనే తాను ఆత్మహత్య చేసుకోవాలని నిశ్చయించుకున్నట్లు ఆ వృద్ధురాలు పోలీసులకు తెలిపారు.

దాడి కేసులో మరో నిందితుడి అరెస్టు



వడ్డీ వ్యాపారి అరెస్టు చూపుతున్న టూటౌన్ సీఐ రెడ్డప్ప

ధర్మవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాంతినగర్‌లో చేనేత కార్మికుడు రమణ, ఆయన భార్య భారతిలపై దాడి చేసిన కేసులో ఏడో నిందితుడైన గుజ్జల విజయ్‌కుమార్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఆయన తెలిపినమేరకు....చేనేత కార్మికుడు రమణ కుటుంబంపై దాడి ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేశామన్నారు. ఇదివరకే ఐదుగురిని అరెస్టు కూడా చేసినట్లు తెలిపారు. మరో ఇద్దరు పరారీ ఉండగా అందులో ఏడో నిందితుడైన గుజ్జల విజయ్‌కుమార్‌ను ధర్మవరం రైల్వేస్టేషన్ వద్ద సోమవారం అరెస్టు చేసినట్లు తెలిపారు. జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా న్యాయాధికారి రిమాండ్‌కు ఆదేశించారని సీఐ తెలిపారు.

పురంలో ప్రాణభయం..!

- వరుస హత్యలతో జనం బెంబేలు
- పోలీసులకు సవాలుగా మారిన ఘటనలు



హిందూపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రశాంతతకు మారుపేరైన హిందూపురంలో వరుస హత్యలు కలకలం రేపుతున్నాయి. ఈ ప్రాంతవాసులు బెంబేలెత్తుతున్నారు. ప్రాణభయంతవణికిపోతున్నారు. గతంలో ఈ ప్రాంతంలో హత్య జరిగితే అందరూ నివ్వెరపోయేవారు. ప్రస్తుతం నెలలో ఒకట్రెండు హత్యలు జరుగుతుండటంతో పోలీసులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. హిందూపురం వాణిజ్యకేంద్రంగా పేరుగాంచింది. పట్టు చీరల కేంద్రంగా ప్రసిద్ధి. ఆసియా ఖండంలోనే అతిపెద్ద చింతపండు, పట్టుగూళ్ల మార్కెట్లు ఉన్నాయి. పలు వ్యాపారాల నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి నిత్యం పెద్దసంఖ్యలో పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో వరుస హత్యలు ఆందోళన రేపుతున్నాయి. ఇటీవల వెలుగుచూసిన హత్యలకు వివాహేతర సంబంధాలే ప్రధాన కారణంగా తేలుతోంది. చిన్నపాటి గొడవల కారణంగా కూడా హత్య చేయడానికి వెనకాడటంలేదు. క్షణికావేశంలో మనుషులను క్రూరంగా నరికి, పొడిచి చంపుతున్నారు.

ఇటీవల జరిగిన హత్యలు ఇవీ..

- ఈ ఏడాది జూన్ 26న లేపాక్షి మండలం మైదుగోళం వద్ద రవికుమార్ అనే వ్యక్తిని కిరాతకంగా నరికి తల, మొండెం వేరు చేశారు.
- అదేరోజు పరిగి మండలంలో తండ్రిపై కుమారుడు కొడవలితో హత్యకు యత్నించాడు.
- అదేరోజు తూమకుంట చెక్‌పోస్టులో హిందూపురానికి చెందిన రవికుమార్‌ను మైన్‌షాపువద్ద హిందూపురానికి చెందిన వ్యక్తే కత్తితో పొడిచి దారుణంగా హత్యచేశాడు.
- రెండు నెలల క్రితం లేపాక్షి మండలంలో ఒక వ్యక్తిని కిరాతకంగా చంపేసి, ముళ్ల పొదల్లో పడేశారు.
- రెండు నెలల క్రితం పెనుకొండ మండలంలో ఓ మహిళ హత్యకేసు సంచలనం రేకెత్తించింది. వేరే ప్రాంతంలో హత్యచేసి పెనుకొండ మండలంలో పడేసి వెళ్లారు.
- తాజాగా లేపాక్షి మండలంలో తిలక్‌నగర్‌వద్ద ఓ వ్యక్తిని ఆటోలో తీసుకెళ్లి కత్తులతో పొడిచి కిరాతకంగా చంపారు.
- అదేరోజు పరిగి మండలం కొడిగెనహళ్లి పంచాయతీలో ఓ మహిళను కర్రలతో కొట్టి చంపారు.

పోలీసులకు పెను సవాల్

వరుస హత్యలు పోలీసులకు పెనుసవాల్‌గా మారాయి. ఒక కేసును ఛేదించేలోపే మరొకటి జరుగుతోంది. ఒకప్పుడు ఏడాదిలో ఒకట్రెండు హత్యలు జరిగేవి. దానికే పోలీసు అధికారులు జంకేవారు. ప్రస్తుతం వరుస హత్యలు పోలీసు అధికారుల్లో వణుకు పుట్టిస్తున్నాయి. ప్రశాంతతకు మారుపేరైన హిందూపురంలో హత్యలు జరగడం ఇక్కడి ప్రజల్లో ఆందోళన కలిగించే అంశం.

క్షణికావేశంలో జీవితాలను నాశనం చేసుకోవద్దు:
- మహేష్, డీఎస్పీ, హిందూపురం

సమస్య, అనుమానం ఉంటే పోలీసులకు చెబితే న్యాయం చేస్తారు. క్షణికావేశంలో విలువైన ప్రాణాలను తీయవద్దు. జైలు పాలు కావద్దు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం.

టమోటా కిలో రూ.44

అనంతపురం రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.44తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.30, సరాసరి ధర రూ.38 పలికినట్లు చెప్పారు. మార్కెట్‌కు 3,750 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.3,500, సరాసరి ధర రూ.10వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా950 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

చలివిడి తిని అస్వస్థత..!

వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరిన బాధితులు



శింగనమల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

శింగనమల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పండుగ కోసం తయారు చేసిన చలివిడి, నానవాలు తిని 30మందికిపైగా అస్వస్థతకు గురైన సంఘటన మండలంలోని పెద్దమట్లగొంది గ్రామంలో జరిగింది. శ్రావణమాసం రెండో శనివారం సందర్భంగా గ్రామానికి చెందిన కొన్ని కుటుంబాల వారు నాగులపుట్టకు పాలు పోసి, పండుగ చేశారు. ప్రసాదాలుగా నల్ల, తెల్ల చలివిడి తయారు చేశారు. పూజల అనంతరం ఆ తినుబండారాలు తిన్నారు. సాయంత్రం నుంచి దాదాపు 30 మందికి పైగా వాంతులు విరేచనాలతో ఇబ్బంది పడ్డారు. రోజు గడిచినా తగ్గకపోవడంతో కొందరు ఆదివారం స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి పరుగు తీశారు. అయినా కొందరికి తగ్గపోవడంతో 22 మందికి పైగా సోమవారం శింగనమల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు పరుగు తీశారు. వారిలో ఓ చిన్నారి తోపాటు లక్ష్మిదేవి, తులశమ్మ, నాగరత్నమ్మ, నారాయణమ్మ, శివయ్య, సుబ్రహ్మణ్యం, రాధమ్మ, పెద్దగంగన్న, సరిత, అనిత నాగేంద్ర, నిర్మల, అమృత తదితరులు ఉన్నారు. శింగనమల ఆసుపత్రిలో వైద్యుడు రోహినాథ్ మెరుగైన సేవలు అందించారు. ఎవరికి ఎలాంటి ప్రాణహాని లేదన్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ వైద్యులకు సూచించారు.

డీఎంహెచ్ఓ పరామర్శ

శింగనమల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న బాధితులను డీఎంహెచ్ఓ ఈబీదేవి, తరిమెల మెడకల్ ఆఫీసర్ శంకర్‌నాయక్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. ఎంపీడీఓ భాస్కర్, గ్రామ సర్పంచ్ రమేష్, టీడీపీ నాయకులు గుత్తా ఆదినారాయణ వెంకటేశ్ తదితరులు పరామర్శించి, బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.



బాధితులను పరామర్శిస్తున్న డీఎంహెచ్ఓ ఈబీ దేవి

విజేతలకు ఎస్పీ సన్మానం



ఎస్పీతో కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు

అనంతపురం క్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఏపీ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో ఉద్యోగాలు సాధించినవారిని జిల్లా ఎస్పీ జగదీష్ సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ స్టడీ సెంటర్, డిజిటల్ లైబ్రరీ నిరుద్యోగ యువతకు చేయూత అందించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఇక్కడ ప్రిపేర్ అయిన వారిలో 13 మంది అభ్యర్థులు సివిల్, 10 మంది ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారు మాట్లాడుతూ తమకు పోలీస్ శాఖ ఎగ్జామ్స్ స్టడీ సెంటర్, లైబ్రరీ ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ఉచితంగా శిక్షణ అందేలా చూసిన ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పేకాట స్థావరాలపై దాడులు

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేకాట స్థావరాలపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా ఎస్పీ రత్న ఓప్రకటనలో పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం పుట్టపర్తి, బుక్కపట్నం మండలాల్లో డీఎస్పీ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో ఏకకాలంలో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఇందులో పైపల్లి గ్రామ శివారులో పేకాటాడుతున్న 15మందిని అరెస్టు చేసి రూ 2.03లక్షలు, బుక్కపట్నం మండలం మదిరేబైలు, రెడ్డిపల్లి గ్రామసరిహద్దులో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2.05 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. కొత్తచెరువు సీఐ మారుతీ శంకర్, బుక్కపట్నం ఎస్సై కృష్ణమూర్తి వారి సిబ్బందితో ఆయా గ్రామశివారుల్లో రహస్యంగా పేకాడుతున్న ఆడుతున్న వారిని పట్టుకున్నారు. వారి నుంచి మొత్తంగా రూ.4.8 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని వారిని త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

హిందూపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): హిందూపురం పట్టణంలోని ఎంజీఎం క్రీడా మైదానం సమీపంలో రైలు కింద పడి సుమారు 50ఏళ్లున్న వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ సజ్జప్ప తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 2గంటల సమయంలో లోకో పైలెట్ ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా 5.5అడుగుల ఎత్తు ఉన్న మృతదేహం వారి కంట పడింది. హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. ఎవరైనా గుర్తిస్తే 9440627641కు సమాచారం అందించాలన్నారు.

నేత్రదానం



కుళ్లాయప్ప (ఫైల్)

అనంతపురం వైద్యం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ఎక్కలూరి గోపాల్(73) నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. గోపాల్ ఉన్నఫలంగా మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులు రెడ్‌క్రాస్ సొసైటీకి సమాచారం ఇచ్చారు. గోపాల్ రెండు నేత్రాలను ఐ రిట్రైనల్ సెంటర్ ఆప్తాలమిక్ ఆఫీసర్ రాఘవేంద్ర సేకరించారు. గోపాల్ భార్య రామసబ్బమ్మ, కుటుంబ సభ్యులను జన విజ్ఞాన వేదిక జిల్లా నేత రామకృష్ణ, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ అభినందించారు.

న్యూస్ బాక్స్

ఈ సెల్‌ఫోన్లు మాకొద్దు..

● అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన



నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఓబుళదేవరచెరువు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్ర భుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు తమకు వద్దని సోమవారం మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పేర్కొన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని మహమ్మదాబాద్ క్రాస్‌లోని సీడీపీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి కుళ్లాయప్ప, ప్రాజెక్టు కార్యదర్శి రంగప్ప, ఆశీర్వాదమ్మ ఆధ్వర్యంలో సీడీపీఓ కార్యాలయం ఎదుట బైటాయించి సెల్‌ఫోన్లతో నిరసన తెలిపారు. ఆ సెల్‌ఫోన్‌లలో 3జీ సిమ్‌లు ఉండడంతో యాప్ సరిగా పనిచేయడం లేదన్నారు. కొత్త సెల్‌ఫోన్లతో పాటు 5జీ సిమ్‌లు ఇవ్వాలన్నారు. ఆయన సెల్ ఫోన్లను సీడీపీఓ కార్యాలయంలో వెనక్కు ఇచ్చినట్లు వారు తెలపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు క్రిష్టమ్మ, మణిమాల, సుజాత, షమీమ్, వరలక్ష్మి, ఆదిలక్ష్మి, సరళ తదితరులు పాల్గొన్నారు.

క్షయను తరిమికొడదాం: వైద్యాధికారి

కదిరి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధిని తరిమికొడదామని వైద్యాధికారి డాక్టర్ ఆప్తాజ్ పేర్కొన్నారు. తలుపుల మండలంలోని ఓబులరెడ్డిపల్లిలో సోమవారం క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ గీతా, ఆరోగ్య కార్యకర్త అరుణ తదితరులు ఉన్నారు.

క్రికెట్ టర్ఫ్ ప్రారంభం

కదిరి, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మదనపల్లి రోడ్డులోని చైతన్య పాఠశాల వెనుక ఏర్పాటు చేసిన క్రికెట్ మైదానంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టర్ఫ్‌ను సోమవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమానికి టీడీపీ నాయకుడు అనిల్‌కుమార్ రెడ్డి, సీఎ ఇస్మాయిల్, పలువురు క్రికెట్ అభిమానులు పాల్గొన్నారు.

రాయల విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

అమడగూరు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద శ్రీకృష్ణదేవరాయుల విగ్రహ ఏర్పాటుకు సోమవారం బలిజకాపులు భూమిపూజ చేశారు. బలిజ సంఘం మండలాధ్యక్షులు గోపాల్, బలిజ సంఘం నాయకులు శ్రీనివాసులు, చిన్నప్ప, ఆంజి, సప్లైయర్స్ రమేష్, రేవంత్, పవన్ తదితరులు ఉన్నారు.

ఆక్రమణలు అరికట్టండి: టీడీపీ

కదిరి అర్బన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గజ్జలరెడ్డిపల్లి ప్రాంతంలోని 311 సర్వే నంబర్‌లో కాలువగట్టు భూమి అక్రమణలకు గురవుతోందని, వాటిని అరికట్టాలని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజశేఖర్‌బాబు సోమవారం తహసీల్దార్ మురళీక్రిష్ణకు వినతిపత్రం అందించారు. రియల్టర్లు కాలువగట్టు భూమిని రోజురోజుకు అక్రమిస్తూ, ఆ ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేస్తున్నారని వివరించారు. అధికారులు సర్వే చేయించి, ఆ భూమిని ప్రభుత్వ అవసరాలకు గానీ, ప్రజా ప్రయోజనాలకు వినియోగించుకోవాలన్నారు. ఇప్పటికే దాదాపు రెండెకరాలు అక్రమణకు గురైందన్నారు.

మాదక ద్రవ్యాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ ప్రశాంతి

ధర్మవరం, ఆగస్టు 4(ఆంధ్ర జ్యోతి): మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి మాట్లాడుతూ... మత్తుప దార్థాలు, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జీవితాలు దుర్భరమవుతాయని అన్నారు. మాదక ద్రవ్యాలను అరికట్టాల్సిన బాధ్యత విద్యార్థులపైనా ఉందన్నారు. ఎక్సైజ్ ఎస్‌ఐ నాగరాజు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కుళ్లాయిరెడ్డి, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ వాణిజ్య దినోత్సవంపై...

బుక్కపట్నం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచ వాణిజ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలకేంద్రంలోని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం అవగాహన క్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మగ్బుల్‌హుస్సేన్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం ప్రపంచలో వాణిజ్యానికి ఉన్న ప్రముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజ్‌మహమ్మద్, శ్రీనివాసులు, ఓబులేసు, నాగేంద్ర, ఆనంద్, వెంకటనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

'దేశాభివృద్ధిని శాసించే స్థాయిలో ఈ-కామర్స్'



ప్రతిభావంతులకు బహుమతులు అందిస్తున్న విద్యాసంస్థల చైర్మన్

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిని శాసించే స్థాయికి ఈ- కామర్స్ విభాగం చేరిందని శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ పరీక్షల సంచాలకులు వెంకటరమణ పేర్కొన్నారు. సోమవారం మండలపరిధిలోని జగరాజుపల్లి మంగళకర డిగ్రీ కళాశాలలో కామర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వెంకటరమణ హాజరై మాట్లాడారు. అనంతరం కామర్స్ విభాగంలో ప్రతిభ కనపచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్యప్రకాష్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, బుక్కపట్నం కామర్స్ అధ్యాపకులు ఓబులేసు, మంగళకర అధ్యాపకులు జయచంద్రారెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ధర్మవరం రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారంపల్లి 44వ జాతీ యరహదారిలో ఐషర్ వాహనంలో కర్నాటకుకు అక్రమంగా తరలుతున్న రేషన్‌బియ్యాన్ని సోమవారం రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి దాడులు చేసి పట్టుకున్నారు. సీతారంపల్లి క్రాస్ వద్ద వాహనాన్ని తనిఖీ చేసినప్పుడు రేషన్‌బియ్యాన్ని గుర్తించామన్నారు. వాహనం డ్రైవర్ గుజ్జల సతీష్‌ను విచారించగా సోమందేపల్లికి చెందిన నరేష్, చెన్నేకొత్తపల్లికి చెందిన సద్దాంకు చెందిన బియ్యం అని తెలిపారన్నారు. వాటిని గుత్తి, అనంతపురం నుంచి బెంగళూరు, పావగడ, తుముకూరుకు తరలిస్తున్నట్లు తెలిపారు. వెంటనే బియ్యంతో ఉన్న వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు. డ్రైవర్ సతీష్, నరేష్, సద్దాంపై కేసు నమోదు చేశామన్నారు. వాహనంలో ఉన్న 341బస్తాల(170.50 క్వింటాళ్లు) స్వాధీనం చేసుకున్నట్లు సీఎస్‌డీటీ చెన్నకేశవనాయుడు తెలిపారు.

వసతి గృహం ఉంటే మేలు

● నల్లమాడలో ఇంటర్ విద్యార్థులకు...

● అందుబాటులో భవనాలు: విద్యార్థులు, తల్లిదండ్రులు



నల్లమాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల

నల్లమాడ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఇంటర్ విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పిస్తే, పదో తరగతితోనే చదువులు నిలిపివేయకుండా సులువుగా ఇంటర్ కూడా పూర్తి చేసుకుంటారని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. నల్లమాడలో గతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రభుత్వ హాస్టళ్లు ఉండేవి. ఎస్టీ హాస్టల్‌ను పూర్తిగా మూసివేసి, అందులోని విద్యార్థులను నల్లమాడలోని ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏకైక ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో చేర్చారు. ఇక బీసీ హాస్టల్‌లో విద్యార్థులు అంతంత మాత్రంగానే ఉన్నారు. వారు స్థానిక ప్రభు త్వ పాఠశాలలో చదువుకుంటున్నారు. ప్రస్తుతం ఎస్టీ హాస్టల్ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోగా యేడాది క్రితం ఎస్సీ హాస్టల్ భవనంలోకి మార్చారు. మండలంలో నల్లమాడ, ఎర్రవంకపల్లి, రెడ్డిపల్లి, పాత బత్తలపల్లి, దొన్నికోట, కురమాల, సి. బండవాండ్లపల్లిల్లో జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటితో పాటు ఎస్టీ ఆశ్రమ పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో దాదాపు 250మంది పది చదువుతున్నారు. పది పరీక్షల అనంతరం ఇంటర్ విద్యకోసం వారు నల్లమాడ జూనియర్ కళాశా లలో విద్యార్థులు చేరుతున్నారు. అలాగే ఓడీసీ మండలకేంద్రంలోని కొండకమర్ల, పుట్టపర్తి మండలంలోని వెంగళమ్మచెరువు, కంబాలపర్తి గ్రామాల విద్యార్థులు కూడా నల్లమాడ జూనియర్ కళాశాలకు వస్తుంటారు. దూర ప్రాంతాల నుంచి ప్రతి రోజు కళాశాలకు రా వడానికి అవకాశం లేని చాలా మంది విద్యార్థులు పదోతరగతితోనే చదువుకు స్వస్తి పలుకుతున్నారు. చదువులో ప్రతిభ ఉన్నా ఆర్థిక ఇబ్బందులతో ఇంటర్ విద్యను కొనసాగించ లేక చాలామంది విద్యార్థులు కార్మికులుగా మారుతున్న సంఘటనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పేద విద్యార్థులు ఇంటర్ పూర్తి చేసేలా ప్రభుత్వం అవకాశం కల్పించాల్సిన అవసరం ఉంది. మండలకేంద్రమైన నల్లమాడలో ఇంటర్ చదివే విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పిస్తే మరింతమంది ఇంటర్ చదివే అవకాశముంటుందని పలువురు తల్లిదండ్రులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న పిల్లలకు నల్లమాడలో రెండు బీసీ హాస్టళ్లు, ఒక ఎస్టీ హాస్టలు ఉన్నాయి. ఇందులో ఉన్న పిల్లలు మాత్రం సుదూర ప్రాంతాలనుంచి వచ్చి హాస్టల్‌లో ఉంటూ నల్లమాడలో చదువులు కొనసాగిస్తున్నారు. ఇంటర్ విద్యార్థులకు కూడా హాస్టల్ వసతి కల్పిస్తే సుదూర ప్రాంతాల విద్యార్థులతోపాటు నల్లమాడ మండలంలోని ఎనిమిది జిల్లా పరిషత్ పాఠశాలల విద్యార్థులు నల్లమాడలోనే ఇంటర్ పూర్తి చేసే అవకాశముంటుందని ప్రజలు, తల్లిదండ్రులు అంటున్నారు.

బస్సు వసతి కల్పించాలి

బస్సు సౌకర్యం లేకపోండంతో నల్లమాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలకు వచ్చే పలు గ్రామాల విద్యార్థులు ఆటోలు, ద్విచక్రవాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. కదిరి నుంచి పులగంపల్లి, దొన్నికోట, చౌటకుంటపల్లి మీదుగా, ఓడీసీ నుంచి కొండకమర్ల మీదుగా, మలకవేమలనుంచి ఎర్రవంకపల్లి, కొత్తపల్లితండా, రెడ్డిపల్లి మీదుగా నల్లమాడకు బస్సు సౌకర్యం కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. దీంతో ఆయా ప్రాంతాల నుంచి నల్లమాడకు విద్యార్థులు వచ్చేందుకు సులువుగా ఉంటుందని వారు అంటున్నారు.

బస్సు నడపండి



నేను ఓడీసీ మండలంలోని కొండకమర్ల గ్రామం నుంచి రోజూ నల్ల మాడ మండలకేంద్రంలోని జూనియర్ కళాశాలకు వచ్చి చదువుకుంటున్నా. ప్రతిరోజు రాను, పోను రూ. వంద ఖర్చు అవుతోంది. ఓడీసీ నుంచి నల్లమాడకు బస్సు సౌకర్యం ఉంటే మేము సులువుగా బస్సులో వచ్చి తక్కువ ఖర్చుతో చదువుకునే అవకాశముంటుంది. ఓడీసీ, నల్లమాడకు బస్సులు ఏర్పాటు చేయాలి. -గౌతమ్, సెకండియర్ సీఈసీ, కొండకమర్ల

హాస్టల్ వసతి కల్పించండి



నేను నల్లమాడలోని ఎస్టీ బాలుర ఆశ్రమ పాఠశాలలో ఆరో తరగతి నుంచి చదువుతున్నా. అక్కడే హాస్టల్‌లో ఉంటున్నా. ఇప్పుడు పదో తరగతి. హాస్టల్ ఉండడం వల్ల సుదూర ప్రాంతం నుంచి వచ్చి నాలుగేళ్ల చదువు పూర్తి చేసి, ఐదో సంవత్సరం కొనసాగిస్తున్నా. ఇంటర్ విద్యార్థులకు కూడా నల్లమాడలో హాస్టల్ వసతి కల్పిస్తే మా లాంటి వారు ఇక్కడే ఇంటర్ చేరే అవకాశం ఉంటుంది. నల్లమాడలో ఇంటర్ విద్యార్థులకు కూడా హాస్టల్ వసతి కల్పించాలి. -భాస్కర్‌నాయక్, విద్యార్థి, కరావులపల్లితండా, గోరంట్ల మండలం

చౌకబారు రాజకీయాలు మానుకో

● మాజీ సీఎం జగన్‌పై ఎమ్మెల్యే సింధూరారెడ్డి ఆగ్రహం

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): విలువలులేని రాజకీయాలకు కాలం చెల్లిందనీ... వైసీపీ నాయకులు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి నీతిమాలిన, చౌకబారు రాజకీయాలు మానుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి సోమవారం ప్రకటనలో మండిపడ్డారు. వైసీపీ కనుమరుగు కాకుండా రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు జగన్ తన మీడియాలో విలువలు లేని రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. ఒక మహిళపై సభ్యసమాజం తలదించుకునేలా నీచంగా మాట్లాడిన నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని పరామర్శించేందుకు జగన్ వెళ్లడం, ప్రభుత్వంపై నిందలు వేయడం ఏమిటని ప్రశ్నించారు. జగన్ మీడియాలో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెల్లూరు టూర్ ఫ్లాప్‌కావడంతో గ్రాఫిక్స్‌లో చూపించాల్సిన దుస్థితి జగన్‌కు వచ్చిందని ఎద్దేవాచేశారు.


చట్టపరిధిలో ఉన్నవాటికి సత్వర న్యాయం: డీఎస్పీ

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో (పీజీఆర్ఎస్) వచ్చే ప్రజా ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి, చట్టపరిధిలో ఉన్న వాటిని సత్వరమే విచారణ జరిపి ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తామని మహిళాపోలీసు స్టేషన్ డీఎస్పీ ఆదినారాయణ తెలియచేశారు. ఎస్పీ రత్న ఆదేశాల మేరకు ఆయన ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఫిర్యాదుదారుల నుంచి డీఎస్పీ 75 ఫిర్యాదులను స్వీకరించారు. వాటిపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో ఉన్న వాటికి సత్వరమే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.


పీఆర్‌సీ కమిషన్‌ను నియమించాలి: ఏపీటీఎఫ్

ధర్మవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీ కమిషన్‌ను నియమించి, ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సానే రవీంద్రారెడ్డి డిమాండ్‌చేశారు. ఏపీటీఎఫ్ నాయకులు సోమవారం పట్టణంలోని బీఎస్ఆర్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, శివానగర్, శాంతినగర్ ఉన్నతపాఠశాలలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....నూతన పీఆర్‌సీ 2023 జూలై 1వ తేదీ నుంచి అమల్లోకి రావాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు ప్రభుత్వం కమిషన్‌ను నియమించకపోవడం ఉపాధ్యాయ, ఉద్యోగులను తీవ్ర నిరాశకు గురిచేస్తోందన్నారు. ఏపీటీఎఫ్ పట్టణ ప్రధాన కార్యదర్శి జగదీశ్, నాయకులు ప్రకాశ్, రమేశ్‌బాబు, అమానుల్లా, గోపి, వెంకటేశ్, శేఖర్, అంజినాయక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రేషన్ షాపులో డబ్బా పెట్టి తూకాలు



సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న దృశ్యాలు



తనకల్లు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చౌకడిపోల ద్వారా నిత్యవసర వస్తువులు పంపిణీ చేపట్టింది. అయితే అధికారులు పర్యవేక్షణను విస్మరించడంతో డీలర్లు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని చౌక డిపో - 17లో డబ్బా పెట్టి తూకాలు వేస్తున్నారు. తూకాల్లో రేషన్ తక్కువ రావడంతో ఇదేమని ప్రశ్నించినా అటు డీలర్లుకానీ, ఇటు సంబంధిత సీఎస్‌డీటీకాని స్పందించలేదని విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. తమకు జరిగిన అన్యాయం గురించి సోషియల్ మీడియాలో కొక్కంటి క్రాస్‌కు చెందిన ఓ కుటుంబం పెట్టిన వీడియో హల్‌చల్ చేస్తోంది. ఈవిషయంపై తహసీల్దార్ షాబుద్దీన్‌నువివరణ కోరగా, రెండురోజుల్లో సంబంధిత చౌకధాన్యపు డీపోను తనిఖీ చేసి చర్యలుచేపడతామన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న పరిటాల శ్రీరామ్

బత్తలపల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందజేస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ తెలిపారు. మండల పరిదిలోని అప్రాచెరువు గ్రామంలో సోమవారం 'మీ సమస్య-మా బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలపై ఆయనకు వినత పత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందజేస్తాయని తెలిపారు. తమకు రాలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నరు. ప్రధానంగా ఇళ్ల స్థలాలు, ఇళ్ల కోసం ఎక్కువగా అర్జీలు వచ్చాయని తెలిపారు. కొంత మందికి సాంకేతిక కారణాల వల్ల ప్రభుత్వ పథకాలు రాలేదని వీలైనంత త్వరగా వారికి అందేలా చూస్తామన్నారు. ఇళ్ల విషయాన్ని ప్రభుత్వం త్వరలో ప్రకటిస్తుందన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా సీఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రజలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు నిరంతరం కృషిచేస్తున్న నాయకుడు మన సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



● ధర్మవరం: ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని 33వ వార్డులో 'మీ సమస్య-మా బాధ్యత' కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



● ధర్మవరంరూరల్: టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ మహేష్‌చౌదరి తదితర నాయకులు సోమవారం మండలంలోని దర్శినమల, మల్లాకాల్వ గ్రామాల్లో 'మీ సమస్య-మా బాధ్యత' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజల నుంచి సుమారు 250దాకా సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించినట్లు వారు తెలిపారు.

● తాడిమర్రి: ధర్మవరం నియోజకవర్గంలో టీడీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మీ సమస్య-మా బాధ్యత' కార్యక్రమాన్ని సోమవారం పెద్దకోట్ల గ్రామంలో టీడీపీ నాయకులు నిర్వహించారు. మండల టీడీపీ కన్వీనర్ కూచిరామ్మోహన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి గ్రామ ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు తీసుకున్నారు.

తల్లిపాలు.. బిడ్డకు శ్రేష్ఠం

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

బిడ్డ ఆరోగ్యానికి తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమని సీడీపీఓ జయంతి పేర్కొన్నారు. మండలకేంద్రమైన బుక్కపట్నంలో సోమవారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే ధర్మవరంరూరల్ మండలంలోని సుబ్బరావుపేటలో గొట్లూరు సెక్టారు పరిధిలోని అంగన్‌వాడీలు పాల్గొని తల్లి పాలవారోత్సవాలను నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో వివిధ రకాల పండ్లు, పౌష్టికాహారంతో కూడిన నమునాలను వేసి అవగాహన కల్పించారు. సీడీపీఓ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మండలకేంద్రమైన నల్లచెరువులోని సీడీపీఓ కార్యాలయంలో సీడీపీఓ వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఓబుళదేవరచెరువులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి ఆధ్వర్యంలో తల్లి పాల వారోత్సవాలపై మండలాధికారులు అవగాహన కల్పించారు. తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ శివరామప్రసాద్‌రెడ్డి, ఎంఈఓ సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలకేంద్రమైన తనకల్లు ఐదో అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మీదేవమ్మ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, సమావేశం నిర్వహించారు.



బుక్కపట్నంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

ఎప్పుడు కూలుతుందో..?



తలుపులలో ఎండిపోయిన వేపచెట్టు

కదిరి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తలుపుల మండలకేంద్రంలో పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఓ వేపచెట్టు ఉంది. అది ఎన్నో ఏళ్లు పచ్చగా ఉండేది. అయితే ఆరు నెలల క్రితం ఎండి పోయింది. అది ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో గాలి వానకు ఎప్పుడు కూలుతుందో తెలియదని ప్రజలు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎండిన వేప చెట్టును తొలగించాలని కోరుతున్నారు.

వర్షం కోసం పూజలు



పూజలందుకున్న అక్కదేవతలు

తాడిమర్రి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వర్షం కోసం మండలంలోని ఆరు గ్రామాల రైతులు పిన్నదరి సమీపంలోని అక్కదేవతల కొండ చుట్టూ గిరిప్రదక్షిణ నిర్వహించారు. మండలంలోని పిన్నదరి, పూల ఓబయ్యపల్లి, పుల్లా నారాయణపల్లి, భీమరాయునిపేట, మద్దెలచెరువు గ్రామాలకు చెందిన చాలామంది రైతులు ఈ గిరిప్రదక్షణ పాల్గొన్నరు. అనంతరం అక్కదేవతలకు ప్రత్యేక పూజలు చేసి, వర్షాలు కురియాలని మొక్కులు చెల్లించారు. భక్తులకు గ్రామస్థుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

● ఓబుళదేవర చెరువు: వర్షాలుకురిసి, పంటలు బాగా పండాలని కోరుతూ సోమవారం మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్పస్వామి ఆలయం లో ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. 101 బిందెల నీటితో అభిషేకం చేశారు. అదును దాటి పోయినా, వర్షాలు కురవకపోవడంతో అయ్యప్పకు జలాభిషేకం చేసినట్లు ఆలయ సంకల్ప కులు పచ్చర్ల ఆంజనేయుల నాయుడు తెలిపారు.



అయ్యప్ప ఉత్సవ విగ్రహానికి జలాభిషేకం చేస్తున్న దృశ్యం

హామీలను నెరవేరుస్తున్న ప్రభుత్వం

● జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధు

ధర్మవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ఒకదానికొకటి నెరవేరు స్తోందని జనసేన పార్టీ రాష్ట ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. మండలంలోని రేగాటిపల్లిలో సోమవారం స్పౌజ్ పింఛన్లను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. అలాగే ఆయన రైతులకు ప్రభుత్వం అందించిన కందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

డయాలసిస్ సేవల పెంపునకు కృషి

●బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు

ధర్మవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోతుకుంట రోడ్డు వద్ద ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన డయాలసిస్ సెంటర్‌లో అధునాతన వైద్యసేవలను పెంచుతామని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీశ్‌బాబు తెలిపారు. ఆయన సోమవారం డయాలసిస్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ నూతనంగా ఏర్పాటుచేసిన డయాలసిస్ యంత్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..ఇంతకుముందు ప్రైవేటు ఆస్పత్రులకు లేదా దూర ప్రాంతాలకు వెళ్లి వేల రూపాయిలు ఖర్చుచేయాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు ప్రభుత్వాస్పత్రిలోనే నాణ్యమైన డయాలసిస్ సేవలు పూర్తిగా ఉచితంగా అందుబాటులో ఉన్నాయన్నారు.

'మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి'



మాట్లాడుతున్న విశాలా ఫెర్రర్

బత్తలపల్లి ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత మహిళలు అన్ని రంగాల్లో రాణించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ఆర్డీటీ ధ్యేయం అని ఆర్డీటీ మహిళా డైరెక్టర్ విశాల ఫెర్రర్ పేర్కొన్నారు. మండలకేంద్రమైన బత్తలపల్లిలో సోమవారం చైతన్య కో ఆపరేటివ్ బ్యాంక్ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశాల ఫెర్రర్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీటీ సిబ్బంది నిరంజన్, ప్రవీణ్ కుమార్, హనుమంతప్ప, క్రిష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో సత్తాచాటిన విద్యార్థులు



మెడల్స్, ప్రశంసాపత్రాలతో ధర్మవరం విద్యార్థులు

ధర్మవరం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కరాటే పోటీలలో ధర్మవరం విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు కరాటే మాస్టర్ ఇనాయత్‌బాషా తెలిపారు. బెంగళూరులోని ఎంసీఏ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జపాన్ షటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో ధర్మవరానికి చెందిన మల్టిస్టార్ బుడోకాన్ అకాడమీకి చెందిన 16 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరచి మెడల్స్ ప్రశాంసా పత్రాలు అందుకున్నారని తెలిపారు. కటా, కుమ్మితే విభాగంలో నవ్యశ్రీ, మహీధర్ బంగారుపతకాలు సాధించినట్లు తెలిపారు. అఫ్రాజ్, ఉదయ్‌కుమార్, నాని కటా విభాగంలో, శర్వీన్ రెడ్డి కుమ్మితే విభాగంలో బంగారు పతకాలు సాధించారని కరాటే మాస్టర్ పేర్కొన్నారు, వీరికి ఆర్గనైజర్ చేతులమీదుగా మెడల్స్ సర్టిఫికెట్లు అందజేశారని ఆయన తెలిపారు. నేషనల్ కరాటే చాంపియన్ షిప్‌లో గోల్డ్‌మెడల్ సాధించిన విద్యార్థిని నవ్యశ్రీని కళాశాలలో ప్రిన్సిపాల్ మల్లికార్జున, కరాటే మాస్టర్ అభినందించారు.

న్యూస్ బాక్స్

ఆలయాల్లో శ్రావణ మాస పూజలు


అలంకరణలో ఆంజనేయస్వామి

మడకశిర టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం రెండ సోమవారం ఆలయాల్లో స్వామివారకు విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణ సమీపంలో మెట్టబండ ఆంజనేయస్వామిని రంగు రంగుపూలతో ప్రత్యేకంగా అలంకరించారు. విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పావగడ రోడ్డులో వెలిసిన చంద్రమౌళేశ్వరస్వామి ఆలయంలో బిల్వపత్రి, తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి ఉదయం నుంచి విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అభయ ఆంజనేయస్వామి తదితర దేవాలయాల్లో పూజలు ఘనంగా నిర్వహించారు. భోగి రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. వందలాది మంది భక్తులు పాల్గొని తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు.

వర్షం కోసం..


గంగమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

రొద్దం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఏఆర్ కొట్టాల గ్రామంలో వర్షం కోసం మహిళలు, రైతులు, పూజలు చేపట్టారు. సోమవారం మండలంలోని ఏఆర్ కొట్టాల గ్రామంలో రైతులు సమీప చిన్నవంకలో గంగమ్మకు పూజలు చేశారు. ముంగారు సేద్యం పనులు మొదలైనప్పటి నుంచి బలమైన వర్షం కురవలేదన్నారు. వందలాది ఎకరాలు కంది, పత్తి, సాగుచేసినా వర్షాలు పడకపోవడంతో పూజలు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు. గంగమ్మకు రెండు పొట్టేళ్ల బలిచ్చి వర్షాలు బాగా కురవాలని వేడుకున్నారు. రైతులు ధర్మప్ప, రామక్రిష్ణ, మధు, శేషు, జయరామప్ప, రామ్మోహన్ పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ


ప్రతిష్ఠించిన గంగమ్మ విగ్రహం

హిందూపురం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని మోతుకపల్లిలో గంగమ్మదేవి విగ్రహాన్ని సోమవారం ప్రతిష్ఠించారు. మూడు రోజులుగా జరిగిన కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సోమవారం ఉదయం నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకం, కలశార్చన, నవగ్రహహోమం, చండీ హోమం, మహాపూర్ణాహుతి, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ రమేష్, పట్టణాధ్యక్షుడు డ్రైస్ వెంకటేశ్, ఎమ్మెల్యే పీఏ బాలాజీ, నాయకులు పరిమళ, చంద్రమోహన్, పవన్, ఆనందప్ప, రామిరెడ్డి, శ్రీనివాసులు, అభిలాష్, వెంకటలక్ష్మమ్మ, కౌన్సిలర్ సతీష్, హరీష్, ఆలయ నిర్వాహకుడు శ్రీకాంత్ పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థినుల ప్రతిభ


ప్రతిభ చాటిన విద్యార్థినులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

హిందూపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు వ్యాసరచన, వక్తృత్వపు పోటీల్లో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ ప్రగతి తెలిపారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో జరిగిన వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు శనివారం జరిగాయి. ఇందులో పాల్గొన్న విద్యార్థులు సౌజన్య, మదిహా మొదటిస్థానంలో నిలవగా తనూష, నిహారిక శ్రీనిధి క్విజ్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్న నందిని వ్యాసరచన పోటీల్లో ద్వితీయ, బీకాం రెండో సంవత్సరం చదువుతున్న మదిహా వక్తృత్వ పోటీల్లో ద్వితీయస్థానం సాధించినట్లు తెలిపారు. వీరు 7వ తేదీన కడపలో జోనల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. వీరిని అధ్యాపక బృందం అభినందించింది.

హెచ్ఎంల డివిజన్ అధ్యక్షుడిగా కేశవమూర్తి


కేశవమూర్తిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

హిందూపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం డివిజన్ అధ్యక్షుడిగా పూలకుంట హెచ్ఎం కేశవమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం కొత్తచెరువులోని ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎంలు సమావేశమయ్యారు. సమావేశంలో తనను డివిజన్ అధ్యక్షునిగా ఎన్నుకున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కరాటే మాస్టర్

పెనుకొండ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రిలియన్స్ ఇంగ్లీష్ మీడియా పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు మాస్టర్ రామచంద్ర, కరస్పాండెంట్ నాగవేణి తెలిపారు. కళాశాలలో చదువుతున్న పర్ణఖానం, లలితశ్రీ, అనిరుద్, మోక్షజ్ఞ, ప్రవీణ్య, మల్లీష్‌నాయక్, కీర్తన, జూనియర్ విభాగం సలోనికుమారి, హర్షిణి, సీనియర్ విభాగంలో ఎంపికైనట్లు వారు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

మూతపడిన హోమియో ఆస్పత్రి

● ఐదేళ్లుగా డాక్టర్ పోస్టు ఖాళీ ● ఇబ్బంది పడుతున్న రోగులు ● పట్టించుకోని వైద్యాధికారులు



మూతపడిన హోమియో వైద్యశాల

మడకశిర రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో కల్లుమర్రి గ్రామంలో ఉన్న ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రిలో డాక్టర్ లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు కల్లుమర్రిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న హోమియోపతి ఆసుపత్రికి వెళ్లి చికిత్సలు పొందుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ ఐదేళ్ల క్రితం బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఫార్మసిస్టుతోనే నడుస్తోంది. డాక్టర్ లేకపోయినా ఫార్మసిస్టు ఇచ్చే మందులను రోగులు తీసుకెళ్లే పరిస్థితి నెలకొంది. ఉన్న ఫార్మసిస్టు కూడా డెప్యుటేషన్‌పై మరో ఆస్పత్రికి వెళ్లారు. ఏడాది కాలంగా ఈ ఆస్పత్రి మూడపడింది. హోమియో మందులు వాడేవారు ఎక్కువగా పట్టణవాసులే. వారు రోజూ వ్యయప్రయాసలకు ఓర్చి కల్లుమర్రిలోని ఆస్పత్రికి వస్తుంటారు. ఆసుత్రిలో ఎవరూ లేకపోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు. మరికొంత మంది హిందూపురంలోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆస్పత్రికి డాక్టర్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

మడకశిరకు మార్చండి: కల్లుమర్రి గ్రామంలో ఉన్న హోమియో ఆస్పత్రిని మడకశిరకు మార్చాలని ప్రజలు, రోగులు కోరుతున్నారు. గతంలో మడకశిరలో ఉన్న ఆస్పత్రికి భవనాలు లేనికారంగా కల్లుమర్రికి మార్చారు. హోమియో మందులు వాడేవారు ఎక్కువగా పట్టణవాసులే కావడంతో గ్రామానికి వెళ్లి చికిత్సలు చేయించుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఆస్పత్రిని నియోజకవర్గ కేంద్రానికి మార్చాలని కోరుతున్నారు.

తల్లిపాలు ఆరోగ్యకరం


సోమందేపల్లిలో మానవహారంగా ఏర్పడిన అంగన్‌వాడీలు

పెనుకొండ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఆరోగ్యకరమని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ మోహన్‌నాయక్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తల్లిపాల విశిష్టత, బిడ్డ ఆరోగ్యం, ఎదుగుదలగురించి వివరించారు. మూఢనమ్మకాలను విడనాడాలని


కరపత్రాలను చూపుతున్న వైద్యులు, సిబ్బంది

సూచించారు. గైనకాలజిస్ట్ నేహా, వైద్యులు, ఐసీడీఎస్ వర్కర్లు, వైద్య సిబ్బంది సుధాకర్ పాల్గొన్నారు.

సోమందేపల్లి: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక వినాయకనగర్ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు అంగనవాడీ టీచర్లు, ఆయాలు సోమవారం ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడ్డారు. సీడీపీఓ శాంతలక్ష్మి మాట్లాడుతూ పీహెచ్‌సీలో బ్రెస్ట్ ఫీడింగ్ గదిని ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఎంపీడీఓ వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్ శుభరాణి, అంగనవాడీ టీచర్లు పాల్గొన్నారు.

నేడు వెయ్యి ట్రాక్టర్లతో భారీ ర్యాలీ

మడకశిర టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ డబ్బులు రైతుల ఖాతాలో జమ కావడంతో మంగళవారం పట్టణంలో వెయ్యి ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. ఉదయం 10 గంటలకు మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయం నుంచి పట్టణంలో ట్రాక్టర్లతో ర్యాలీ ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామి ఆధ్వర్యంలో ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చంద్రన్న సుఖీభవను విజయవంతం చేయండి

అగళి/అమరాపురం/గుడిబండ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో మంగళవారం నిర్వహించే చంద్రన్న సుఖీభవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జడ్పీటీసీ ఉమేష్, మండల కన్వీనర్ మధూడి తిప్పేస్వామి, అమరాపురం మండల కన్వీనర్ కృష్ణమూర్తి, సహకార సంఘం అధ్యక్షుడు గణేష్, అమరాపురం నాయకుడు శ్రీనివాసమూర్తి పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం 10గంటలకు అగళిలో నిర్వహించే చంద్రన్న సుఖీభవ కార్యక్రమానికి తరలిరావాలని వారు కోరారు. సీనియర్ నాయకులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు తెల్లచొక్కా, తెల్లపంచె ధరించి ఆకుపచ్చ రుమాలుతో కార్యక్రమానికి రావాలన్నారు.

రైతులను మోసగిస్తున్న ప్రభుత్వం గద్దెదిగాలి

పావగడ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): రైతు అభివృద్ధి, రైతు సంక్షేమం కోసం పాటుపడుతామని హామీ ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టాక రాష్ట్రాన్ని నట్టేట ముంచిందని జేడీఎస్ పార్టీ తరఫున సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. రైతులు అన్నివిధాలుగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం పక్షపాత ధోరణిని చూపిస్తోందని జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు అర్చి అంజినప్ప ఖండించారు. జిల్లా నుంచి అనేక మంది జేడీఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

పెనుకొండ రూరల్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపురం గ్రామ సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు కొత్తచెరువుకు చెందిన నరసింహులు పెనుకొండవైపు ద్విచక్రవాహనంలో వస్తుండగా పెనుకొండకు చెందిన గౌసియాబాను కొత్తచెరువుకు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా రాంపురం వద్దకు రాగానే ఎదురెదురుగా ఢీకొన్నారు. ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు గమనించి వారిని పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థినులకు అస్వస్థత

రొద్దం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. సోమవారం పాఠశాలలో చదివే లాస్య, సుశ్మిత ఇంటివద్ద నుంచి తెచ్చుకున్న భోజనం తినడంతో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణమ్మ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. మోపర్లపల్లి గ్రామానికి చెందిన లాస్య ఇంటివద్ద నుంచి ఆదివారం చేసిన చారు తీసుకువచ్చి స్నేహితురాలు సుశ్మితతో కలిసి తినడంతో ఇద్దరికి వాంతులు అయ్యాయి. వెంటనే ఆసుపత్రిలో వైద్యం అందించడంతో వారు కోలుకున్నారు.

వీఆర్‌ఓల సస్పెన్షన్

రొళ్ల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో వీరంగం సృష్టించిన వీఆర్వోలపై సస్పెన్షన్ వేటు పడింది. తహసీల్దార్ ఇచ్చిన నివేదిక మేరకు కలెక్టర్ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రొళ్ల, గుడ్డగురికి వీఆర్వోలు రంగనాథ్, నాగరాజులను సస్పెండ్ చేసినట్లు తహసీల్దార్ షెక్షావలి తెలిపారు.

'పాఠశాలల్లోకి అనుమతి లేదనడం సిగ్గుచేటు'



నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

మడకశిర టౌన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థి సంఘాల, ప్రజాస్వామ్యవాదులకు అనుమతి లేదని ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ అన్నారు. సోమవారం పట్టణంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులతో కలసి ప్రభుత్వం విడుదల చేసిన జీవోకు వ్యతిరేకంగా ర్యాలీ చేపటారు. ప్రభుత్వ పాఠశాలల్లోకి మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు మినహా ఎవరినీ అనుమతించరాదని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం బాధాకరం అన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులపై పునరలోచించాలని డిమాండ్ చేశారు. నాయకులు ముతహిర్, షాహిద్, సాయి, తిమ్మరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐడీ కార్డుల పంపిణీ

గోరంట్ల, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రం ఆదర్శ పాఠశాలలోని 85మంది విద్యార్థులకు పూర్వ విద్యార్థి బాలప్పగారి నరేష్ గుర్తింపుకార్డులను అందించారు. సోమవారం హెచ్ఎం నీలమ్మ అశోక్ అభ్యర్థన మేరకు విద్యార్థులందరికీ ఫొటో ఐడీకార్డుల ఏర్పాటుకు అయ్యే ఖర్చును ఆయన భరించారు. ఐడీ కార్డులను ఎంఈఓ జాన్‌రెడ్డెప్ప చేతుల మీదుగా అందించారు. ఉపాధ్యాయులు జయచంద్రనాయక్, నాగలీల, సంప్రీతిబాయి, సునంద, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ బిల్లులు చెల్లించండి

లేపాక్షి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులు చెల్లించాలని మానెంపల్లి గ్రామ ఉపాధి కూలీలు నిరసన తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. కూలీలు మాట్లాడుతూ కూలి డబ్బులు వెంటనే చెల్లించాలని, కుటుంబ పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకుడు గుంతలకు సంబంధించిన బిల్లులు వెంటనే చెల్లిస్తామని ఎంపీడీఓ నరసింహమూర్తి హామీ ఇవ్వడంతో కూలీలు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఉపాధికూలీలు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించండి

పెనుకొండ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీలో భర్తలు మృతిచెందడంతో వారి స్థానంలో పనిచేస్తున్న కార్మికులకు బకాయి ఉన్న వేతనాలు చెల్లించాలని సీఐటీయూ, సీపీఎం నాయకులు మేనేజర్ వెంకటరమణకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఐదు నెలలుగా జీతాలు అందక కుటుంబ పోషణ భారమైందని, వెంటనే వారికి జీతాలు చెల్లించాలని కోరారు. మున్సిపల్ వర్కర్లు, హెల్పర్ల సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సీపీఎం హరి, సీఐటీయూ బాబావలి, చిన్నవెంకటేశ్, కార్మికులు పాల్గొన్నారు.

రొద్దంలో వర్షం


ఆర్. మరువపల్లిలో కురుస్తున్న వర్షం

రొద్దం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. సోమవారం సాయంత్రం మండలంలోని వివిధ గ్రామాల్లో వర్షం పడగా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు ఆందోళన చెందారు. ఉక్కపోతతో అల్లాడిపోతున్న జనానికి రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఉపశమనం లభించింది.

పనిచేయని సెల్‌ఫోన్లు వెనక్కు

పెనుకొండ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): పెనుకొండ ఐసీడీఎస్ కార్యాలయం పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు అందరూ తమకు ఇచ్చిన మొబైల్ ఫోన్లుపనిచేయలేదంటూ ఐసీడీఎస్ అధికారులకు వెనక్కు ఇచ్చారు. సోమవారం జిల్లాప్రధాన కార్యదర్శి వెంకటేశ్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సెల్‌ఫోన్లను అధికారులకు వెనక్కు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ అంగనవాడీలకు 2022లో సెల్‌ఫోన్‌లు ఇచ్చారన్నారు. అందులో 90శాతం పనిచేయడం లేదన్నారు. యాప్‌ల నిర్వహణకు కావాల్సిన నెట్‌స్పీడ్ లేదన్నారు. అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణకు వెంటనే అధికారులు ట్యాబ్‌లు మంజూరు చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు బాబావలి, నాగరాజు, బావమ్మ, జయమ్మ, మాబున్నీసా, సరస్వతి, సావిత్రి, లక్ష్మీదేవి, మీనా, పద్మా, సునీత, అనిత, అనూష పాల్గొన్నారు.

మడకశిర టౌన్: ప్రభుత్వం నాలుగు సంవత్సరాల క్రితం ఇచ్చిన మొబైల్ ఫోన్స్ పనిచేయడం లేదని అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం వాటని కార్యాలయనికి పంపినట్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఉషారాణి తెలిపారు. కార్యకర్తల వద్ద ఉన్న సెల్‌ఫోన్లను బాక్స్‌లోకి వేసి జిల్లా కార్యాలయానికి పంపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, పద్మావతి, ఆరిఫా, ఇందిరమ్మ, నాయకుల పాల్గొన్నారు.

సోమందేపల్లి: ప్రభుత్వం తమకు అందించిన 2జీ మొబైల్ ఫోన్లు మొరాయిస్తుండటంతో పనిభారంతో వేగలేకపోతున్నామని సోమవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీస్‌లో అంగనవాడీలు మొబైల్‌లను వెనక్కు ఇచ్చి నిరసన తెలిపారు. శ్రీలేఖ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ముందు చెప్పినవిధంగా తాము సెల్‌ఫోన్‌లను వెనక్కు ఇచ్చినట్లు తెలిపారు.


ఐసీడీఎస్ అధికారులకు సెల్‌ఫోన్లు అప్పజెబుతున్న సీఐటీయూ నాయకులు


సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మంత్రి సవిత

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

గోరంట్ల, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో 50అడుగుల రోడ్డు విస్తరణ పనులను మంత్రి సవిత సోమవారం పరిశీలించారు. గోరంట్లలోని బస్టాండ్ కూడలి నుంచి రావికుంట చెరువు వరకు రోడ్డు విస్తరణ పనులను గత వైసీపీ ప్రభుత్వం చేతకాక చేతులెత్తేసిన విషయం తెలిసిందే. మంత్రి ప్రతిష్టాత్మకంగా తీసుకుని సీసీరోడ్డు రోడ్డు పనులను ఇటీవల పునఃప్రారంభించారు. సీసీరోడ్డు పోనూ ఇరువైపులా రెండు మీటర్ల వంతునవిద్యుత్ సరఫరా, పైపులైన్ ఏర్పాటు నిమిత్తం రహదారి విస్తరణ కోసం ఆక్రమణలు తొలగించే విషయంలో పార్టీ నాయకులతో మంత్రి చర్చించారు. పనులను స్వయంగా పరిశీలించడానికి క్యూరింగ్ కోసం వేసిన బురదమట్టిని కూడా లెక్కచేయకుండా మంత్రి నడుచుకుంటూ వెళ్లారు. మంత్రి సొంత ఖర్చుతో త్వరలో ఏర్పాటుచేయనున్న అన్న క్యాంటీన్ భవన నిర్మాణం కోసం చిత్రావతి నది ఒడ్డున ఉన్న ఆర్అండ్‌బీ స్థలాన్ని పరిశీలించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. గోరంట్లలోని గాంధీ సర్కిల్‌నుంచి టీటీడీ కల్యాణమండపం వరకు రోడ్డువిస్తరణ చేపట్టే విషయంపై మంత్రి చర్చించారు. ఆక్రమణల తొలగింపు విషయంలో ఆ ప్రాంత ప్రజల అభిప్రాయాలు సేకరించాలని ఆదేశించారు. 60శాతం మంది ప్రజల ఆమోదం లభిస్తే పనులు చేపట్టాలన్నారు. కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి, సోముశేఖర్, నిమ్మల విద్యాధరణి, నిమ్మల శ్రీధర్, వెంకటరెడ్డి, ఉమ్మర్‌ఖాన్, జయచంద్ర, కక్కుల రఘు, పచ్చా అశోక్, నాగరాజు పాల్గొన్నారు.

కార్యకర్త మృతికి నివాళి: పట్టణానికి చెందిన టీడీపీ కార్యకర్త, బూత్ కో-కన్వీనర్ బోయ రఘు (32) గుండెపోటుతో సోమవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మంత్రి సవిత.. కార్యకర్త మృతదేహాన్ని సందర్శించారు. టీడీపీ జెండా కప్పి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శిస్తూ, అధైర్యపడవద్దని పార్టీ అండగా ఉంటుందన్నారు. అంత్యక్రియల కోసం తల్లిదండ్రులకు రూ.20వేలు, పార్టీ నాయకులు నిమ్మల శ్రీధర్ రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. వారితోపాటు కన్వీనర్ బాలక్రిష్ణచౌదరి, సోముశేఖర్ తదితరులున్నారు. మాజీ ఎంపీ నిమ్మలక్రిష్ణప్ప, మాజీ ఎంపీపీ నిమ్మల విద్యాధరణి విడివిడిగా మృతదేహానికి పూలమలలు వేసి, నివాళి అర్పించారు.

స్నేహితుల కలయిక


ఎంజీఎం పాఠశాల పూర్వ విద్యార్థులు

హిందూపురం, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): వారంతా 45ఏళ్ల క్రితం ఎంజీఎం పాఠశాలలో చదువుకున్నారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వారంతా పాఠశాలలో సమావేశమయ్యారు. 1979-80లో పదోతరగతి చదువుకున్నారు. 45ఏళ్ల తరువాత ఒకేచోట కలవడం చాలా ఆనందంగా ఉందన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి


పండ్ల మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

పెనుకొండ, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలునాటి వాటిని పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని ప్రిన్సిపాల్ కేశవరావు కోరారు. సోమవారం స్థానిక పరిటాల శ్రీరాములు కళాశాలలో ఎన్ఎస్ఎస్, సత్యసాయి సమితివారు అందజేసిన మామిడి, పనస, తదితర మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పండ్ల మొక్కలు నాటడంవల్ల పక్షులు, వివిధరకాల జంతువులకు ఆహారం లభించే అవకాశం ఉంటుందన్నారు. మొక్కలు నాటడమేకాక వాటి సంరక్షణ కూడా చేపట్టాలన్నారు. హరిప్రసాద్, అధ్యాపకులు కాంతారావు, రామాంజనేయులు, అటెండర్లు కదిరప్ప, చెన్నకేశవులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రంలో చోరీ


ధ్వంసమైన సామగ్రిని పరిశీలిస్తున్న వైద్యాధికారి

రొద్దం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తురకలాపట్నం గ్రామ నడిబొడ్డున ఉన్న ఆరోగ్య ఉపకేంద్రంలో అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తలుపులు పగలకొట్టి విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారు. గ్యాస్ సిలిండర్, ఆపరేషన్‌కు వాడే టార్చ్‌లైట్, ల్యాప్‌టాప్ తదితర విలువైన వస్తువులు అపహరించారు. అందులో ఉన్న సామగ్రి ధ్వంసం చేయడంపై అనేక నుమానాలకు తావిస్తోంది. నాలుగు రోజుల క్రితం ఆస్పత్రి సమీపంలోని టీడీపీ జెండాకట్టను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఆస్పత్రిలోని వస్తుసామాగ్రిని ధ్వంసం చేయడంపై స్థానిక అల్లరిమూకలే చేసి ఉంటారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ విషయంపై వైద్యాధికారి సోమశేఖర్, వారి సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రెస్‌క్లబ్‌కు స్థలం కేటాయించండి

పరిగి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రెస్‌క్లబ్‌కు స్థలం కేటాయించాలని విలేకరులు సోమవారం తహసీల్దార్ హసీనాసుల్తానాకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ 30ఏళ్లుగా మండలంలో విలేకరులు ఉన్నా, ఇప్పటివరకు ప్రెస్‌క్లబ్ లేదన్నారు. ఇటీవల ఏర్పాటుచేసిన ప్రెస్‌క్లబ్ కమిటీలో అధ్యక్షుడు గిరీష్‌కుమార్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందించారు. శ్రీనివాసరెడ్డి, నరసింహామూర్తి, శ్రీనివాసులు, ప్రశాంత్, చాంద్‌బాషా, వెంకటేష్, నవీన్, హరి, మూర్తి, రామక్రిష్ణ, పాల్గొన్నారు.

రైతుల నడ్డి విరుస్తున్న ప్రభుత్వం


డీటీ రెడ్డిశేఖర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉష శ్రీచరణ్

సోమందేపల్లి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా పొలాలకు కావాల్సిన ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ అన్నారు. సోమవారం పార్టీ శ్రేణులతో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని డీటీ రెడ్డిశేఖర్‌కు వినతిపత్రం అందించారు. పార్టీ పిలుపుమేరకు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వ హయాంలో ఎరువుల కోసం రైతులు క్యూలో నిలబడలేదన్నారు. ప్రస్తుతం పండించిన పంటకు గిట్టుబాటు ధరకూడా లభించడంలేదని ఆరోపించారు. రైతుల నడ్డివిరుస్తున్న ప్రభుత్వం తమ తప్పును దిద్దుకోవాలన్నారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.